

దంపతులు

[రెండంకాల నాటకము]

కర్త

ప్రో. వెం. రంగారావు





ప్రకాశకులు

అడ్డేపల్లి లక్ష్మణస్వామి


సరస్వతీ గ్రంథమండలి

రాజమహేంద్రవరము

1931

వెల
౧-౦-౦

సరస్వతీ పవర్ ప్రెస్ [illegible]



౧. ఇందు చందాదారుగఁ జేరువారు ప్రవేశరుసుము క్రింద ముందుగా ౦—౪—౦ లు చెల్లింపవలయును.

౨. ఇందు రెండేసిమాసముల కొక్కటిగ వెలువడుచుండు క్యాలికో బైండు గల ప్రతిగ్రంథమును రు ౧—౦—౦ వెలకు చందాదారులకుఁ బంపుచుందుము.

౩. గ్రంథములఁ బంపుటకగు పోస్టేజి మొదలగు ఖర్చులన్నియును చందాదారులే భరింపవలయును.

౪. చందాదారు లగువారు వెనుకటి గ్రంథము లన్నియును గొనవలయునను నియమము లేదు. కాని వారు కోరినచో వెనుకటి పుస్తకములుకూడఁ జందాదారుల వెలకే పంపుచుందుము. క్రొత్త వెలువడుచుండు గ్రంథములు మాత్రము చందాదారులు తప్పక పుచ్చుకొనుచుండవలెను.

౫. ఇందుఁ బ్రకటింపఁబడు ననుబంధములు చందాదారులు తప్ప పుచ్చుకొనవలయునను నియమము లేదు. కోరినవారికే పంపు చుందుము.

౬. సంవత్సరము చందా—అనగా ముందు ప్రకటింపబడు ఆఱు పుస్తకములకు ౭—౨—౦ లు ముందుగఁ బంపువారి కాఱుపుస్తకములవఱకు ప్రతిపుస్తకమును అన్‌రిజిష్టర్డు పార్సిలుగ పంపుచుందుము. అట్లు పంపినవారికి ఆఱుపుస్తకములకు చెల్లించవ లసిన మనియార్డరు కమీషను ౦—౧౨—౦ లు రిజిష్టరు ఖర్చు ౦-౧౨-౦ లును రు ౧-౮-౦ లు కూడివచ్చును.

[illegible] దేశా[illegible] గాంధి
[illegible]
[illegible]
[illegible].

పాత్రల సంపుటి

భట్టుమూర్తి	—	లా కాలేజి విద్యార్థి
నరసింహం	—	అతని సహపాఠి
డాక్టరు రామమూర్తి	—	వైద్యుడు - రెండోవృత్తి పెళ్ళిళ్ళుకుదర్చడం
జగన్మోహను	—	వారి స్నేహితుడు - ఇంగ్లండులోవిద్య
కమలమ్మ	—	మూర్తిభార్య
శేషమ్మ	—	నరసింహం భార్య
నారాయణరావు	—	హోటలు నౌకరు

వీధి మీదవారు మనుష్యులు, నౌకరు.

కాలం — ప్రస్తుతం

మొదటి అంకానికి రెండో అంకానికి అయిదుసంవత్సరాలు.

స్థలం — మొదటి అంకం

సీను i లా కాలేజి సింహద్వారం
ii కోమలవిలాస్ కాఫీహోటలు
iii వీధి
iv భట్టుమూర్తి యిల్లు.

రెండవ అంకం

సీను i వీధి
ii భట్టుమూర్తి యిల్లు
iii నరసింహం యిల్లు
vi భట్టుమూర్తి యిల్లు.

దంపతులు

అంకము 1

సీను i

(లాకాలేజి సింహద్వారమువద్ద, పోర్టికో రెండువైపులనుండి భవనంలోనికి రాతి కట్టడపు మెట్లు. వెనుక భవనంమధ్య తోట ఆవరణ, పూలచెట్లు క్రోటనులనడుమ జలయంత్రం (fountain) అచ్చట భట్టుమూర్తి, నరసింహం నిలచి యుందురు. భట్టుమూర్తి పొడుగరి, పచ్చనిరంగు, ఆకర్షకపురుషుని కనులు, సూటుధరించి యుండును. నరసింహం చామనఛాయ, గ్లాసుకోమల్లు సైకిలుకట్టు, నీలిసెర్జి కోటు, టై, అకుజోడు.)

భ—(చక్కని వెండిసిగరెట్టుకేసును కోటు కుడివైపు క్రిందిజేబు నుండి తీసి, దానిని తెరచి స్నేహితునివంక చేయిజాచి) సిగరెట్.

(నరసింహం పుచ్చుకొనును. భట్టుమూర్తి ఒక సిగరెట్టును తీసుకొని అగ్గిపుల్లను వెలిగించి, మొదట నరసింహానికి యిచ్చును. ఆపుల్లతోనే తాను వెలిగించును.)

న—ఈ సిగరెట్లు కాల్చడానికి, యింతదూరం కాలేజికి రావడ మెందుకు. యింటిదగ్గర హాయిగా పేకాట వేసుకోకుండా.

భ—యిక్కడ మెటెండెన్సు యివ్వడానికి కొందరైనా రావాలా కాలేజి తెరచి మూడు మాసాలైంది. నేను రావడం నాలుగో సారి. నిన్న సుబ్బయ్య మాయింటికి టెన్నిసు ఆడ్డానికి వచ్చి, ఎవ్వడు యితర్లకు ప్రాక్సిమెటెండెన్సు యివ్వడం కోసం తాను

ప్రతిదినం కాలేజికి వెళ్లాలిసి వస్తుందని, తనకేమి విశ్రాంతి లేదని గోల పెట్టాడు. పరోపకారార్థం ఎటసిటరా అని చెప్పి ఊరడించాను.

న—నీసదభిప్రాయం సూచించడానికి కాళోలు ఈవేళ కాలేజని అలంకరించావు.

భ—కాని వాడు రోజువస్తే నేమిలే. యింట్లో నిద్రపోవడం బదులు, వెనకబెంచీల మీాద గుర్రుపెడతాడు.

న—పాపం వాడు భార్యపిల్లల యెడబాటుచే తపించి పోతున్నాడు. కాని యెడబాటువల్ల ప్రేమ విజృంభిస్తుంది. అది మనకవుల వర్ణనల బట్టి తేలుతుంది.

భ—ఈ బొమ్మలపెళ్లి భార్యాభర్తలకు అలాంటి అనురాగం ఎక్కడినుంచొస్తుంది. స్త్రీపురుషుల అనురాగం అంటే యేమిటో సరిగా మన కవులకు గూడ తెలియదు.

న—మనదేశంలో సుఖంగా కాలక్షేపం జేసే దంపతులు వేనవేలున్నారు. దాన్నిబట్టే మన సంఘాచారం దైవికమని చెప్పగలను.

భ—సుఖము! సుఖము! మనుష్యుని జీవితానికి సుఖమా ధ్యేయం. మాదొడ్లో ఉన్న ఆవులు సుఖంగా లేవూ! పందెపుగుర్రాలంతకంటే సుఖంగా వుంటాయి. ఈ సుఖంగూడా చాలామంది దంపతుల కుందని నమ్మను.

న—చూడు యింగ్లండులో ప్రతిదినం జరిగే విడాకుల కేసుల సంఖ్య పెరుగుతూవుంది. వాళ్ల వివాహ జీవితపుసారం దాన్నిబట్టి తెలుస్తుంది.

భ—అదిగూడా శ్రేయస్సూచకమే. అనురాగం తప్పిన దంపతులు విడిపోవడమే శ్రేయస్కరం మనతో అనురాగంతో ప్రారంభం కాదు. విడిపోడాని కవసరమే లేదు. వివాహానికి ప్రేమతో నిమి

త్రం లేదు. ఈడుజోడు చూడకుండా పెళ్లి చెయ్యడం దేశాచారమయినపుడు యిక తిరుగుబాటు ఒక్కడినుంచి వస్తుంది.

న—నీవన్నీ విపరీతపు తలపులు. మన తలిదండ్రులు సుఖంగా పవిత్ర జీవితాన్ని గడపలేదా. ఈకష్టపు జీవితంలో అంతకంటే కోరదగిన దేమిటి.

భ—మన వాదన దారి తప్పిపోతుంది. జీవితం విచారసాగరం అంటే నేను మరి మాటాడలేను. జీవితం ఉత్కృష్టమని, అద్భుతమని నమ్మకలయే నామనస్సు పునాదికి మొదటిరాయి. అందుపై మనో భవనాన్ని నిర్మించాలి.

న—యివన్నీ అనుభవంలేని మాటలు. నువ్వు పెళ్లిచేసుకున్నపుడు ఈ ఊహాలన్నీ యేమవుతాయో చూస్తాంగదా.

భ—నే నొకవేళ యింద్రియనిగ్రహం లేక మెత్తపడి, పాతబురద దారిలో పడినప్పటికి, నా నమ్మకం ఎంతమాత్రం చలించదు. ఏమో మన శృంగారకావ్యాలు ప్రబంధాలు చదువుతుంటే తమాషాగానే వుంటుంది. కాని వాటిలో గొప్పలోపం ఉన్నట్టు నాఅంతరాత్మ బోధిస్తుంటుంది. ఆ భావాలు చాలా తక్కువజాతివైనట్టు అంతకంటె విపరీతంగా పవిత్రం అయిన భావం మానవ మనోనిర్మాణంలో యిమిడి ఉన్నట్టున్నూ, అది మన కవులు గ్రంథకర్తలు గ్రహించ లేదనిన్నీ నాకు మాటిమాటికి తోస్తూ ఉంటుంది.

న—మన దేశంలో మాత్రం గొప్ప వాంగ్మయం లేదా. కాళిదాసు శాకుంతలను చదివి డంగయిపోవని పాశ్చాత్యపండితు డున్నాడా. అట్టి కవులకు నీవూహించిన భావం స్ఫురించలేదా.

భ—సంస్కృత వాంగ్మయం రసవంతమైందే. కాని ఆ గ్రంథాలు మన దేశపు భాషలలోకి తర్జుమాచేసి, ప్రతికవి ఆభావాల్నే అటుతిప్పి యిటుతిప్పి ప్రతి పుస్తకంలో యిమిడ్చి విసుకుపుట్టించేశారు.

తర్జుమా చేసిన వాళ్లు మహాకవులమని పిల్చుకుంటూన్నారు. తర్జుమాదారు ఒక కవి వ్యాయామశాస్త్రం అచ్చశాస్త్రం పద్యాల్లో వ్రాసినవారు మరికొందరు కవులు. అందరు కవులే, అందరు రాజులే.

న—కొందరు కవిరాజులు. హేళనచెయ్యడంకంటె విమర్శనచేసి దురభిప్రాయాలు తొలగించ గూడదా! ఆవిధంగా నయినా దేశానికి కొంతసేవ చెయ్యొచ్చును.

భట్టు—చదువు ముగించిం తరువాత దేశసేవగురించి ఆలోచిద్దాంలే. నాకున్న చిక్కేమిటంటే సంఘాన్ని మార్చకుండా, జీవితసృష్టి పథాన్ని విశాల పరచకుండా, ఏమీ చెయ్యలేము. మనగ్రంధకర్తలకు అట్టిభావాలు స్ఫురించక పోవడానికి కారణమేమిటి? మన పరిస్థితులే. కల్మషంతో నిండినయింట్లో ఎన్నిసార్లు స్నానం చేసినా, ఎన్ని మడులు కట్టుకున్నా తిరిగి ఆకల్మషంలోపడి కొట్టుకోవలిసిందే. మనస్సుకు వికాసంకోరితే పరిస్థితులు మార్చివేయాలి. పూర్తిగామార్చివేయాలి.

నర—ఏమిటి! చాలాసీరియస్ అయిపోతున్నావు. యిదేమి కాంగ్రెస్ ప్లాటుఫారమ్ అనుకుంటున్నావా మాస్టర్లు లెక్చర్లువినడం బదులు, నీమాటలు వింటే కాలేజికురావాళ్లకి కొంచెం వినోదంగా నయినా ఉంటుంది ఈమాస్టర్లపని మా బాగుంది. వాళ్లు చెప్పేది ఎవరూ వినరు గనుక, పరిహాసంలేనిపని. అదిగాక రోజుకొకగంటే.

భ—కొత్తగా ప్లీడరి ప్రారంభించినవారికి యిదొక జీవనోపాధి. యిక నేర్చుకోవడమా. యితరకాలేజీలు మాబాగున్నాయా. ఈ చదువంతా జీవనోపాధికి మార్గమే. గుమాస్తావనికి మంచితరిఫీదు.

న—చదువు ముగించేసరికి పెళ్ళాం పిల్లలు నెత్తిమీద కూచుంటారు. అందుచేత దీర్ఘాలోచన లేకుండా చేతచిక్కినపనిలో ప్రవేశించడమే.

నీ వివాహం మాటేమిటి. చాలా సంబంధాలొస్తున్నాయట.

భ—అవును వివాహపు మార్కెటులో నన్ను చాలా విలువైన వస్తువుగా చూపిస్తున్నారు. రోజూయెవరోవచ్చి బాధ పెడుతునేఉంటారు. నన్నడిగితే మా నాన్నగారిని అడగమంటూ. ఆయన్నడిగితే నన్నడగమంటారు. ఒకక్కప్పుడు వాళ్లని ఏడిపిస్తుంటానుగాని, పూర్ డెవిల్స్, వాళ్ళని చూస్తే కనికరం వేస్తుంది.

న—మీనాన్న ఏమి కలుగచేసికోపోవడానికి కారణం ఏమిటి.

భ—అదొకకథ. గోకవరంలో ఒక లోభిఉన్నాడు. అతనికి ఒకత్తే కూతురు. కట్నం ఎంతైనా యిస్తామన్నారు. కాని పిల్లమాత్రం యీ రంగు (అతని కోటువైపుచూపును.)

న—అయితేనేం.

భ—యితర విశేషాలుగూడ ఉన్నాయి. మాయింటికప్పట్లోవచ్చారు. దూరపు బంధువు లనుకుంటూ.

న—ఆవిడను ఈవిధంగా డిఫేము చెయ్యడం—

భ—పెళ్ళి అయిపోయిందిలే. వాళ్లిద్దరును సుఖదంపతుల సమూహంలో చేరారు.

న—ఆవిడను చేసుకోక పోవడానికి ఏమి సమాధానం యిచ్చావు మీ నాన్నగారికి.

భ—సమాధానం—ఒకమాటచెప్పాను. మనపరిస్థితుల్లో వివాహం అయిన తరువాతగదా దంపతులప్రేమ పరీక్షవుతుంది. అంచేత సౌందర్యంఅన్నా స్త్రీకి ఉంటే కొంతజమతో గృహస్థాశ్రమం ప్రవేశించవచ్చని మానాన్నగారిని వప్పించాను.

న—మీనాన్న—అతను సరసుడే.కుమారుని సౌందర్యపూజ గ్రహించి మావాడు చదువు ముగిస్తేనేగాని పెళ్లిమాట తలపెట్ట నన్నాడండి. తరవాత ఆలోచిద్దాం అన్నాడు.

భ—బాగా పూర్తిచేసేవు. వాళ్ళు యితనికోసం కాచుకున్నామంటే రెండికిచెడ్డ రేవడవుతుందని, నెత్తిన పెట్టుకొచ్చి ముడివేసేశారు. మన రెక్కలు స్వేచ్ఛగానే ఉన్నాయి.

న—అప్పట్లో నీహృదయం యింకొకచోట వాలింది కాబోలు.

భ—రోజుకొకచోట వాలుతుంటుంది. అది నిముషమాత్రమే. సతింగ్ సీరియస్. కాని నిన్న ఎలిఫిన్సటన్‌లో హావేయియస్—స్ప్లెండిడ్ (Splendid) ఆ నృత్యం ఆ గానం. ఆ రెండుగంటలు నిర్ఘాంతపోయి చలించకుండా కూచున్నాను. అందులో ఒక బెదరిన లేడి చూపుల కోమలాంగి నా హృదయాన్ని—

న—ఏమిటిది. కవిత్వధోరణిలో పడుతున్నావు.

భ—అట్టి అనుభవాలే భావాన్ని దీపింపచేస్తాయి. వాంఛలు సానపెట్టినట్టయి, అగ్నిజ్వాలలాగు ప్రకాశిస్తాయి. ఆవిడతో మాట్లాడడానికయినా మన కవకాశంలేదు. కాని పిల్లమాత్రం రాజావేపు చూడగూడదా. రేపు మళ్ళా ప్రోగ్రాం మారుస్తున్నారు. నీవు గూడ రా.

న—యిప్పుడు కొంచెం ఖజనా చిక్కులు.

భ—అది ఎపుడు ఉండేరోగమే. క్రానిక్ (Chronic) అయితేనేం సర్దుబాటుచేదాంలే. డన్ (Done) ఎనిమిదిన్నరకే థీయేటరుకు వచ్చేయి.

(తెరవెనుక గంట వెనుకనుంచి గుసగుసలు, చప్పుడు

విద్యార్థులు వచ్చుచున్నారు.)

న—అదిగోగంట ఫలహారపుకాలం. యీమూక మనలో చేరక మునుపే కోమల విలాస్‌కు పోదాంరా.

(వారు నిష్క్రమించుచుండగా తెర)

(కోమలవిలాస్ కాఫీహోటల్, హావుసఫలార్డ్సు, ఒకగది. వెనుక ఎడమచేయివేపుద్వారం. ఆపక్కను ఒక చిన్నబల్లవద్ద ఒక ముసలి వాడు లాల్చీపంచలో కూచుని యుండును. ఎడమగోడవేపు అద్దపుబీరువాలో ఫలహారములు, ఆపక్క బల్లపై గ్లాసులు, కప్పులు, సాసర్లు గదిమధ్య రెండు మార్బిల్ కప్పుగల బల్లలు, యిరువంకల కుర్చీలు, ఎడమగోడవంక చిన్నబల్లపై నీటిడబ్బా.

ముందునుండి భక్తమూర్తి నరసింహం ప్రవేశించి చేతులు డబ్బావద్ద కడుగుకొని, ఒకసారి అద్దములో ముఖావలోకనము గావించి, ముందు బల్లవద్ద యిరుప్రక్కల కుర్చీలపై కూరుచుందురు. వెనుక మరియిద్దరు మనుష్యులు కూచొని ఫలహారములు తినుచుందురు. మలయాళీ నౌఖరు చిన్నగుడ్డను మాత్రము మొలకుకట్టుకొని, గుడ్డతో బల్లలను తుడుచుచుండును.)

న—(నాయరు గుడ్డపట్టుకుని తమ బల్లవద్దకు రాగా) నాయర్! మాబల్ల తరువాత తుడవచ్చును. ఆ గుడ్డమాత్రం యిటు తీసుకు రావద్దు. ప్రతినిముషం లోషనులో కడిగినా శుభ్రపడదు.

భ—చెడ్డవస్తువులే నాదృష్టిపథంలోకి వస్తాయి. వాటిని తలపెట్టక పోతే మననేమీ బాధించవు. నారాయణరావు (అని పిలుచును) (వెనుక సన్నని చొక్కా, క్రాపింగుతల, గూడకట్టుతో, వెనుక బల్ల దగ్గర ఉన్నవారికి ఏదో అందించుచుండును. సార్ అనును. మా గడుసువాడోయి. ఎవర్ని ఎలాగు సంతోషపరచాలో బాగా తెలుసును.

న—అందులో నువ్వంటే హోటలు వెయిటర్లు నడుం కట్టుకొని సవరిస్తారు. నీ రుచులన్నీ బాగా తెలుసు. నీడబ్బుసంచి మరీబాగా.

భ—ఎప్పుడు డబ్బుగొడవేనా మనకు లేం దరొక్కటే. (యింతలో నారాయణరావు వెనుకనుండి వచ్చి అణకువగా నిలుచును. అతనిని ఉద్దేశించి) ఏమిటి ఈవేళ స్పెషల్ (Special)

నా—కొల్కటారసగుల్లా, బాదాంపూరీ, స్వీటు, లెమనుకిచడి సేవరీ.

భ—ఏమి పేర్లు, ఏమి పేర్లు. మీ మేనేజరు ఈపేర్లు ఎక్కడ సంపాదిస్తాడో అతను కూడా ఒక కవి అయియుండాలి సృష్టిస్తాడు. సరే ఏమంటావు నరసింహం.

న—నీకేదిష్టమో నాకూ అదే.

భ—స్వీటు అరసగుల్లా. కాని సేవరీ. ఈసేవరీ పెద్దసమస్య. ఎప్పుడు కిచ్చడీలే కాతులే ఒక విధమైన కట్టు రంగువేసిన ఉప్మా అంతే.

నా—మీకు ఏసేవరీ పట్టదండి. వంగాయదోసె వేయించేదా లేక పోతే పూరీ ఉరలగడ్డలా.

భ—మొదట రసగుల్లా తీసుకురా అది లోనికివెళ్లి ఊహకు సహాయం చేస్తుంది.

(నారాయణరావు చిఱునవ్వుతో పోవును)

న—చదువులు ఉద్యోగాలు అని దేవుళ్లాడ్డం కంటె, ఒక కాఫీహోటల్ పెట్టుకుంటే యిక ముందాలోచన అక్కర్లేదు. ఆకిష్టయ్యరు చూడు. పదేళ్లలో ఆరులతులు సంపాదించాడు. సాయంకాలము వాడికొడుకు కోడలు, బ్యూకిసీడను కార్లో బీచి షికారు.

భ—మొదటిది కాఫీహోటలు పెట్టడాని కయినా కొంతడబ్బుండాలి. అది మనకు లేదు. రెంకు మనిషి డబ్బువల్లనే జీవించడు.

న—"ధనము లేకున్న బ్రతుకు వ్యర్థమ్మె సుమ్మి."

భ—ధనం కొంతశక్తి నివ్వవచ్చు. ఆశక్తిని వాడుక చెయ్యడంలో ఉంది. ధనం సంపాదించినంత మాత్రాన ఆశక్తి రాదు.

(వెనుక ద్వారమునుండి డాక్టరు రామమూర్తి ప్రవేశించును.

లాంగుకోటు, తలపాగ, బిళ్లగోచిపోసి కట్టిన ధోవతి, చేతిలో విశ్రుత
మగు కఱ్ఱ, తెల్ల కేన్వాసు జోళ్లు.)

న—ఆమనిషిని నాకు వ్యక్తిత్వాన్ని సూచించే వేషం.

భ—(కొంచెము పక్కకు తిరిగి రామమూర్తివైపు చూచును. అసంతుష్టి సూచకమగు గొంతుతో) యిదేమిటి ఈడచ్చా వచ్చాడు. అతనొక వివాహాలు ఏజెంటు. స్వరాజ్యప్రభుత్వంలో మంత్రిపని బాగా చెలాయించ గలడు. ఈ చెద్ద బేరంలోనుంచి ఏదో విధంగా పైకి రావాలి. (యింతలో వెతుకుకొనుచు రామమూర్తి వారిని సమీపించును. భట్టుమూర్తి లేచి సగౌరవముగా) గుడ్ మార్నింగ్ డాక్టర్. చాలాకాలానికి మీ దర్శనం, దయచేయండి.

(అందరూ కూర్చుందురు.)

ఈ కాఫీహోటళ్ల మూలంగా మన సంఘజీవనం మారుతూ ఉంది. స్నేహితులని కలిసుకోవచ్చు, ప్రస్తుతసమస్యలను చర్చించవచ్చు. క్షమించండి. (నరసింహంగారికి జూపి) నరసింహంగారు మానవహోధ్యాయి. డాక్టరు రామమూర్తిగారు వైద్యులు. ఈ మనికి తెలియని వాళ్లు ఈ వూళ్ళో లేరు.

(నరసింహం డాక్టర్ను చిరునవ్వులతో నమస్కరింతురు.)

డా—భట్టుమూర్తిగారు మిమ్మల్ని కలుసుకోవాలని యెన్ని ప్రయత్నాలు చేశానండీ! మీయింటికి వెళితే టెన్నిసుకు వెళ్ళారనో, నాటకానికి వెళ్ళారనో ఎక్కడికి వెళ్ళారో మాకు తెలియదనో చెప్పేవారు. కాలేజికి వెళితే అయనెప్పుడు కాలేజికిరారు. క్లబ్బులో బిలియర్డ్సును ఆడుతుంటారని చెప్పేవారు. ఈవేళ ఉదయం మీ స్నేహితుడు సుబ్బయ్యగారు కనపడి ఎక్కడలేకపోయినా, టిఫిని వేళకు కోమలవిలాస్ హావుసాఫ్ లార్డ్సును తప్పదని చెప్పారు.

భ—చూచారా లెజిస్లేటివు కవున్సిలుకంటె కాఫీహోటళ్ళు సంఘా

నికి చేసే ఉపకారం. కాని ఇన్నింత ఉత్సాహంగా వెంటాడ్డాని కేదో విశేషం ఉండాలి.

డా—ఏముంది. మీ తండ్రిగారికి నాకు ఎంతస్నేహం. మీ తాత గారు మావూళ్లో—

భ—ఈ మనవంశవృక్షాల అల్లిబిల్లిక లేంగాని.

(నారాయణరావు ఫలహారం తెచ్చి బల్లపై నుంచును. డాక్టరు వంకకు భట్టుమూర్తి తనప్లేటుతోసి) మరొకటిక ప్లేటు తీసుకురా. పుచ్చుకోండి డాక్టరుగారు విశేషంఏమిటో చెప్పారుగారు.

న—విశేషం కొంత గ్రహించినట్టున్నావు. ఏమిటా ఆతృత.

డా—(కొంచెంసందేహంతో) కాదండీ—నిజంగా—మిమ్మలని చూద్దాం (నరసింహంవంక జూచును.)

భ—సందేహం అక్కర్లేదు. నరసింహం మనలోవాడే. నాప్రియ మిత్రుడు. పెళ్ళికూడా అయిపోయింది.

డా—మీ కంతా హేళనగానే ఉంటుంది. వైభవంగా పెళ్ళిచేసు కొని ఉద్యోగాలుచేస్తే మాలాంటివాళ్లంచూసి సంతోషిస్తాం.

(నారాయణరావు ఫలహారము తెచ్చిపెట్టును)

భ—నేవరీ నాకేమివద్దు. కాఫీతీసుకురా. ఊరో.

(డాక్టరువంక నరసింహంవంక చూచును.)

డాక్టరు నరసింహంలు—మాకుఅంతే.

(నారాయణరావు పోవును.)

భ—ఏమంటున్నావు—అ—పెళ్ళి—అవును ఎవరికి యిష్టమైన పన్నువును వారు కోరడం స్వాభావికమే. కాని ఈవిధంగా తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు, పిల్లల నివ్వడానికి సిద్ధంగా ఉన్న వాళ్లు, వివాహంకాని యువకులని బాధించడం ఎందుకు. ఆకలి వేసినప్పుడే ఆహారంరుచి. స్త్రీవాంఛ కలిగిం తరవాతే పెళ్ళి తలపెట్టాలి.

డా—స్త్రీవాంఛ లేనివాళ్ళవరున్నారు. అరిగ్రహించే మనపూర్వులు ఆవాంఛ కలిగేసరికి మనస్సు యితరచోట్లకి పోకుండా వివాహం మూలంగా కట్టిపెట్టనున్నారు.

భ—అయితే వివాహం అయినంత మాత్రాని మనస్సు యిస్థారయి, యితరచోట్లకు పోదన్నమాట. యిది అనుభవవేద్యమా.

డా—ఎప్పుడైనా పోతేనేమిలెండి. తిరిగిశాశ్వతమైన భార్యవంక మరలి వస్తుంది.

భ—చిరకాల పరిచయంవల్ల అట్టి సంబంధం ఏర్పడుతుంది కాబోలు.

(నారాయణరావు కాఫీ తెచ్చియిచ్చును. అందరు కాఫీ పుచ్చుకొనుచు మాటాడుదురు)

న—డాక్టరుగారు వచ్చినపని చెప్పక పోవడానికి కారణం నేను గాబోలు. నేను వెళతా.

డా—అబ్బె కూచోండి. మీకుపూర్వసాంప్రదాయాలంటే కొంత గౌరవం ఉన్నట్టుంది. మీసలహా అయినా పుచ్చుకుంటారు.

న—సలహా తరువాత పుచ్చుకోవచ్చు. అదీగాక నాకు కాలేజిలో కొంచెంపని ఉంది సెలవు.

భ—సరే. రేపు ఎల్ఫిన్స్టన్ వద్ద ఎనిమిదిన్నరగంటలకు గుడ్ మార్నింగ్.

(నరసింహంలేచి వచ్చినదారినిపోవును.)

డా—ఈవిషయంలో మీకు నూతన అభిప్రాయం ఉన్నట్టు యిదివరకే విన్నాను. కాని నా అనుభవాన్నిబట్టి సరియైన సంబంధం వస్తే ఆ మనమాత్రం అంగీకరించదా. అన్ని అంగములు సరిలేక నిరసన భావం లోగడ చూపించి ఉంటారని మనస్సు సమాధానపరచుకొని మిమ్మల్ని వప్పించే దృఢసంకల్పంతో వచ్చాను.

భ—సంకల్పమేగదా సృష్టికిమూలం. నేను అభిప్రాయం కొంత

మార్చుకుంటున్నాను. సిలిబేటుగా పెళ్ళిచేసుకోకుండా ఉందామని లోగడనిశ్చయించాను. కాని మనిషియొక్క జీవితం సమానార్హములుగల మరియొకవ్యక్తితో కలవని స్నేహప్ప వికసించదు. పురుషులతో స్నేహంవల్ల. స్త్రీఅయితే ప్రేమవల్ల. అట్టిప్రేమ సంబంధమే సంఘంలో వివాహంగా పరిణమించాలి.

డా—మీ అభిప్రాయం చాలా బాగుంది. అందువల్లే వివాహం అయినతరువాత దంపతులు విధిగా ప్రేమించాలి.

భ—అది బండిముందు గుర్రంవెనకాల అవుతుంది. పూర్వము స్కాట్లాండులో కొందరు ప్రభువులు ఎవరైనా నరహత్య చేసేరని తెలిస్తే వాళ్ళని ముందుగా ఉరతీయించి తరవాత కేసువిచారణ చేసేవారట.

డా—బాగు! బాగు! కాని ఈసంబంధం అన్నివిధాల బంగారం వంటిది. మూడువేలు కట్నం. కొంతభూమికూడా పిల్లకు వ్రాసియిస్తారు.

భ—కట్నం పుచ్చుకోడంకంటె మూర్ఖం మరొకటి లేదు. పెళ్ళిని సంస్కారమని పెద్దపేరుతో పిలవడం బదులు, కూరగాయలబేరం అంటే బాగుంటుంది. కాని కట్నాలు యివ్వడం వల్ల తండ్రులు గుల్లయిపోతున్నారన్నమాట నమ్మను. కూమాళ్ళ వివయమై వేనవేలు ఖర్చుచేస్తారు. ఎంతమూర్ఖుడేనా సరేకాని కుమార్తెకు ఒక పెయ్యో రెండువేలో యిచ్చేసరికి కొంపములిగి నట్టు ఆలోచిస్తారు. పత్రికలలో పెద్దవ్యాసాలు. పెళ్ళి అయ్యేవరకు యింట్లో దాసీపనికూడ చేయిస్తారు. పెట్టేభోజనం కూలి కిటుటుంద. యిదంతా స్త్రీలు దాస్యస్థానంలో ఉండడంవల్ల.

డా—ఏమండి, స్త్రీ గృహలక్ష్మిగదా ప్రతియింట గృహ వ్యవహారాల్లో యజమాని భార్యయేగదా.

భ—భార్యలేని యింట్లో మీరు నౌకరును పెట్టుకుంటే వాడికి ఉంటుంది అంత అధికారం.

డా—అయితే స్త్రీకి ఆస్తి ఉండడం శ్రేయస్కరమేగదా.

భ—తప్పక. అదియే ఆత్మగౌరవానికి మొదటిసోపానం. అందుకే తండ్రులు తమస్థితినిబట్టి కుమార్తెలకు ధనమియ్యాలి. వరుడు పుచ్చుకోడం నీచమైనపని.

డా—సరే. మీ రివ్వదలచిన డబ్బు ఆమెకే యివ్వవచ్చు. అలాగయితే మీ కిష్టమేనా?

భ—నా యిష్టమేమిటి. ఏదో లోకవిషయం మాటాడేం గాని నా విషయం ఏమిటి?

డా—మళ్ళి మొదలుకు వచ్చారు. మీ నాన్నగారితో యీ విషయం మాటాడేను. ఈసంబంధం బాగా నచ్చింది. వారిది విజయనగరం. ఆయనకు కోటలో ఉద్యోగం. పిల్ల చూపసి. పదహారేళ్లుంటాయి. ఫొటోగ్రాపు గూడ తెచ్చాను. అది మీకు నచ్చితే మిగిలిన యేర్పాటంతా నేను చేస్తాను.

భ—నన్ను చక్కగా బుట్టలో వేస్తున్నారే. స్వతంత్రంగా పెళ్ళికి ముందు స్త్రీ పురుషులు కలుసుకొననిచ్చి, ప్రేమించనిచ్చి—

డా—అది మన సంఘంలో లేనివిషయం. పిల్లను చూడ్డానికయినా వీలులేదే.

భ—ఫొటో చూడవచ్చా? ఏది అయినా చూదాం. (డాక్టరు తన జేబులోని ఫొటో తీసియిచ్చును. భట్టుమూర్తి తేరిచూచును. మెల్లగా) చాలా చక్కనిదే. అంటే ఫొటోను విజ్ఞానదృష్టితో చూస్తే నాగరికతాచిహ్నలేమీ కనపడవు.

డా—(భట్టుమూర్తిలో కొంతమార్పు కలుగుటను గ్రహించి) నాగరికత కేమిలెండి. కొద్దిరోజులు పెద్దపట్నంలో వుంటే అందులో

మీా సాంగత్యం.

భ—అయినా ఆమెను ఒకసారి నిజరూపంలో చూడాలి. అప్పు డాలోచించి చెపుతాను. యిది ఒడంబడికగా గ్రహించకూడదు. చూచినతరువాత యిష్టమయితే.

డా—మనలో అది యెలా కుదురుతుంది. తీరా మీారు చూచింతరు వాత, అంగీకరించకపోతే—ఏమవును.

భ—జీవితం అంతా అపాయాలతో నిండిఉంది. వాటిని తప్పించు కోడమే జీవితానికి ముఖ్యమైన ఆనందం. నేనుకోరింది అంత కఠిన మైంది కాదు.

డా—లేకపోతే కొన్నాళ్ళపాటు యిద్దరు పూదోటలలో విహారం చేసి ఆత్మపరీక్ష చేసుకున్నతరువాత పెళ్ళి విషయమై ఆలోచించా లనిమా.

భ—వీలయిన అదేమే నాకు సమ్మతం. కాని మన సంఘపరిస్థితు లలో అట్టిది చంద్రునికోసం ఆసించినట్టే. సంఘానికి నాగరికత అబ్బింతరువాత. స్త్రీ పురుషులకు విజ్ఞానమబ్బిన తరుపరి.

డా—అయితే మీా అభిప్రాయ మేమిటి.

భ—కడసారిమాట వినండి. కట్నం పుచ్చుకోను. వారి కిష్టమయితే తగు ధనం వధువు కివ్వవచ్చును. అది వారిపని. ఆమెను ముందుగా చూడాలి. నాకంగీకారమైతే అపుడు తెలియజేస్తాను. ఫొటో కొంత నన్ను—ఆకర్షించింది. అందువల్లే యింతవరకైనా ఒప్పు కొన్నాను.

డా—ఏమోనండి. వారు పూర్వాచారపరాయణులు. ఒప్పుకుంటా రనుకోను. మళ్ళీ మీారు బాగా ఆలోచించి—

భ—(విసుగుతో) అదిమే నా ఆఖరుమాట. యితరవిషయాలు మా టాడవచ్చు.

దా—అయినా గట్టిప్రయత్నం చేస్తాను. యీ విషయంమాత్రం పరమ రహస్యంగా ఉంచాలి.

భ—ఆహా! మీయుక్తికి యిలాంటివి యేమాత్రం. నారాయణరావు బిల్లుతీసుకురా (నారాయణరావు పళ్ళెములో బిల్లుయిచ్చును. భట్టుమూర్తి డబ్బుయిచ్చును.)

ఫలహారా లెలాగున్నా, బిల్లుమొత్తం దొరల రెస్టురాంటులకే చవకని పిస్తుంది. వెళదాం. యిం కెక్కడికి.

దా—తిరువళిక్కేణి పోవాలి.

భ—నేను మవుంటురోడ్డువరకువస్తాను. సెన్ బెనెట్టులో నేను ఒకసారి చూడాలి.

(నిష్క్రమణ - పోవుచుండగా తెర)

సీను iii

(చెన్నపట్నం బీచి. వెనుక సముద్రం కనపడవలెను. ఒడ్డునకు బాటకు మధ్య పూలచెట్లు. యిసుకలో చిన్నకాలువలె నిగూరు చేయబడిన సొంపుకు మొక్కలు. యువకులు విహారముచేయుచు పోవుచుందురు. సముద్రపు ఘోష వెనుకనుండి వినబడును. భట్టుమూర్తి సూటుతో మెల్లగా నడచుచు ప్రవేశించు)

భ—ఏమిటి. సరిగా నడవడానికి కూడ దారిలేదే. చల్లగాలివీల్చడం గురించి ప్రజలకు బాగా తెలిసింది. నాగరికతాచిహ్నమే. ఊటీ నుండి అంతా దిగిపోయారు. అక్కడ వర్షాలు. తొమ్మిది మాసాలు ఎండలు యిక్కడనుభవించవచ్చు. నరసింహాం అదుగో వస్తున్నాడు.

నర—(సంతోషముతో)

హాల్లోమూర్తి—హావుడుయిను.

భ—హావుకు, దు. ఎప్పుడొచ్చావు. కొంచెం బలిసినట్లున్నావే.

నర—సెలవులు మూడు మాసాలు పనిలేక కూచోడంవల్ల అలా కనిపిస్తాను. పగలు మాడిపోడం. రాత్రి ఊపిరి తిరక్క ఉక్కిరి బిక్కిరయిపోడం. ఈయెండలు యమబాధ. నీకేంచల్లగా కొండల మీదనుంచి దిగావు.

భ—లేదు. ఈసంవత్సరం మా నాన్నగారు పట్నంలోనే ఉంచారు. అదిగాక మేలోనేగా, నా పెళ్లి. ఆ విజయనగరంలో యెండల మంట, దోమల గానం బాగా అనుభవించాం.

నర—నీ పెళ్లికి రావాలనుకున్నాను గాని, నీ ఉత్తరం అందేసరికి కొంచెం అనారోగ్యంగా ఉంది. అదీగాక ఎండల్లో ప్రయాణమంటే—

భ—నీ వక్కడిదేనా సున్నితమైన ప్రాణం. ఒక ఉత్తరమైనా రాసేవు గావే.

నర—ఏముంది రాయడానికి. పల్లెటూరిలో పదిరోజు లుండే సరికి, ప్రకృతిలో లీనమైపోతాం. పనిలేని తీరుబాటులేని మధ్యావస్థలో చిక్కి సమాధిలో పడతాం.

భ—సమాధివల్ల లోచూపు అబ్బుతుంది. ప్రపంచాన్ని శోధించలేకపోయినా, జయించినట్లు తోస్తుంది. ఆ స్థితి వర్ణించలేకపోయావు.

నర—అలాంటి వర్ణనలు ఉత్తరాల్లో రాయడంకూడ ఒక లలితకళే. నాకంత సామర్థ్యం లేదు.

భ—సామర్థ్యం అభ్యాసంకూడ కుదరవమ్మా. అయినా నీవు లేకపోవడం చాలా లోటయిపోయింది. నా గొడవ చెప్పుకోడానికి ఎవరూ లేకపోయారు. సుబ్బయ్య వచ్చాడు గాని, ఎప్పుడు నిద్రే. దోమలను జయించింది వా డొక్కడే.

నర—నీకోరిక సాగిందా! స్వయంవరం లభించింది. మొదట ఆమెను చూడ్డానికి వెళ్లినప్పుడు తమాషా అని చెప్పావే. ఆమనోహరాంగిని ఒకసారి చూచేసరికి లవ్ ఎట్ ఫస్టు సయిటుగా (Love at first sight) కాబోలు. పదిహేనురోజుల్లో ముహూర్తం ఏర్పాటు చేసుకునేవరకు నిద్రపట్టలేదని చెప్పి, యింత ఆలస్యం చెయ్యకూడదని, కాలి మెర్రగా ఉన్నప్పుడే సాగదీశారు. అయినా కొంత ఫేటు నుదుట వ్రాసే దుంటుంది. ... [illegible]

భ—అది మా నాన్నగారి చేత. వప్పుకున్నాడు, యింక ఆలస్యం చెయ్యకూడదని, కాలి మెర్రగా ఉన్నప్పుడే సాగదీశారు. అయినా కొంత ఫేటు నుదుట వ్రాత కూడ ఉంటుంది.

నర—ఓహో! మనుష్యుని స్వతంత్రయిచ్ఛ, మొదలైన భావాలన్నీ ఏమయినాయి. వివాహం మంచి పాఠాలు బోధిస్తున్నాది.

భ—అనుభవంవల్లే జ్ఞానం వస్తుంది. ఇదివరకుండే అభిప్రాయానికి భిన్నంగానే. మానవజీవితంలో కొంత యేర్పాటు చేయబడిన పరిస్థితి. కొంత స్వయంకృషి. రెండు కలిసి వుంటాయి. పూర్తిగా ఒకటే ఉన్నదనడం వెర్రి.

నర—కాని ముఖ్యవిషయం. నీ భార్యను తీసుకువచ్చావా. యీకొత్త జీవితం రమ్యంగా ఉంది కాబోలు.

భ—యింకా తీసుకురాలేదు. కొన్నాళ్ళవుతుంది. జీవితంలో ఏదో మార్పు గలిగినట్లు తోస్తుంది. మనస్సుకు యిదేమిటో చూదాం అనే కుతూహలం కలుగుతూ ఉంది. నీకుకూడా నిజమైన వివాహం సెలవులలో అయిందట. రాజమండ్రిలో ప్రాక్టీసు చేస్తానని చెప్పావే.

నర—మావాళ్లు ఎప్రెంటిసుగూడా ఒకసంవత్సరం వెలిగించమన్నారు. బుచ్చిరామయ్యగారివద్ద చేరాను. తన ఆఫీసుకు నాయిష్టం వచ్చినపుడు రావచ్చుని చెప్పారు. ఎప్పుడైనా హైకోర్టుకు షికారుగా వెళ్లవచ్చు. యిదే డ్యూటీ. ఒక సంవత్సరం హాయిగా పట్నంలో

ఉండవచ్చు. చదువు ముగించినతరువాత ఈమాత్రం విశ్రాంతి ఉండాలి.

భ—మన కిప్పుడు విశ్రాంతే. చదువుకునే రోజుల్లో పుస్తకాలతో సంబంధం అరుదే. యిప్పుడు విదేశసంచారంచేస్తే కొంత మనో వికాసమైనా లభిస్తుంది.

నర—నాయాత్రలు గ్రహాల సంచారంవలె ఎప్పుడు ఒకమార్గంలోనే నడుస్తాయి. మావూరినుంచి యిక్కడికి,యిక్కడ్నించి మావూరికి. ఇక మనోవికాసం భార్యవల్ల కలగాలి. కొద్దిరోజుల్లో నాభార్యను తీసుకువస్తా. పరశువాకంలో యిల్లు కుదిర్చాను.

భ—ఆవిడకు కూడా నాగరికతామతం బోధిస్తాం. గృహస్థాశ్రమ ప్రవేశానికి, మనస్నేహితు లందరికి మాయింట్లో విందుచెయ్యాలి. బ్రహ్మచార్యానికి సెలవివ్వడానికి, నువ్వది విడిచిపెట్టడానికి అనేక సంవత్సరాలనుంచి ప్రయత్నం జేస్తున్నావు. నేనొకత్రుటిలో మారిపోయాను.

నర—నీ బ్రతుకంతా విచిత్రం. నివ్వు చెప్పినట్టు విందు చేదాంలే. నీభార్య వచ్చింతరువాత మావాళ్లతో స్నేహం చెయ్యాలి.

భ—ఓ తప్పక. వాళ్లిద్దరికు బాగా స్నేహం కుదరవచ్చు. యిద్దరు పల్లెటూరి పడుచులే. పూర్వసాంప్రదాయాల్లో పెరిగినవాళ్లు. నాగరికతాభావాలు వెతికినా కనపడవు.

నర—పరిచితునివలె నా భార్య గురించి మాటాడుతున్నావు. నా భార్య అందరివలె గాదు.

భ—అదిగో. ప్రతిమనిషీ ఆవిధంగానే తలుస్తారు. కాని మన స్త్రీలలో వ్యక్తిత్వ మెక్కువుంది. అందరూ రమారమి ఒకటే పైపు. అందులో చిన్నభేదం ఒకటుంది. అది నీతివిషయం. నీతిని అనుసరించినవారు అందుకు వ్యతిరేకంగా నడిచేవారు. ఈ రెండు ఒక

చెట్టు కొమ్మలే. ఏకొమ్మకు ప్రాముఖ్యత లేదనవచ్చు. ఒకవిధమైన ధైర్యం కొందరికుంది. కొందర కదీలేదు.

నర—మన పరిస్థితులలో దేనియందు నీకభిలాష ఉన్నట్టు కనపడదు. గృహస్థాశ్రమం కొన్ని మంచిపాఠాలు నీకు బోధిస్తుందిలే.

భ—నేకోరేది అదే. నాభయం ఏమిటంటే తుదకు ఈఆశ్రమంగూడ గొడ్రాలిగా తయారయి నాఆశను భంగం చేస్తుందని

నర—మన స్నేహితుడు జగన్మోహను యింగ్లండుకు వచ్చేవారం వెళుతున్నాడు. ఆక్సఫర్డ్‌లో చదువుతాడట. తరువాత సివిల్ సెర్వీసుకో, బారుకో చదువుతాడట. నితో చెప్పమనికూడా చెప్పాడు.

భ—అదృష్టవంతుడు. పాశ్చాత్యనాగరకతానుంచి స్వయంగా అనుభవించవచ్చు. కాని క్రొత్తమార్గాలు కృషి చెయ్యడంలో అభిలాష కలవాడు కాడు. శ్రమలేకుండా కాలంగడపడమే అతని సూత్రం. యితన్ని మార్చగలిగితే పాశ్చాత్యసంఘంలో జీవితసారం ప్రబలి ఉందని మెచ్చవచ్చు. అచ్చటి విద్యయొక్క శక్తిగూడ గ్రహించగలం. ఎంతకాలం యింగ్లండులో చదువు. నీకు తెలుసా.

నర—నాలుగుసంవత్సరాలు పట్టునట. సికలు పాసవుతాననే నమ్మకం అతనికి లేదు.

భ—అతనికే లేకపోతే, అతన్ని పరీక్షించేవారికంతకంటా ఉండదు. చివరకు ఈ బారిస్టర్ల సమూహంలో చేరి నీకు పండితస్నేహితుడవుతాడు.

నర—నీకుమాత్రం కాదా. అడగడం మరచాను. ఎవరివద్ద ప్రవేశించావు, ఎప్రెంటిసుగా.

భ—ఎప్రెంటిసుగాడవ నాకు లేదు. లావద్ద సెలవు పుచ్చుకున్నాను. ప్రస్తుతస్థితిలో నావంటి విమర్శనాపురుషునికి ప్లీడరివృత్తి సరి

కాదు. పూర్వుల అభిప్రాయాలయందు నిరాటంకమైన గౌరవం ఉన్నవారే ప్లీడరిలో నెగ్గగలరు.

వర—అయితే యిప్పుడు ప్లీడరి చేస్తున్నవారందరికీ అలాంటిగౌరవం ఉన్నదా. ఉదరపోషణార్థం ఏదో ఒక వృత్తి అవలంబించాలికదా.

భ—యిప్పుడు ప్రత్యేక కృషి ప్రబలి, ఎవరివృత్తి వారి జీవితాన్ని, ఆవృత్తి ధర్మమైన ఆకారంలోకి మారుస్తున్నది. అందులో ప్లీడరీ జీవితాన్ని పరిపాలిస్తుంది. అన్నివిషయాల్లోను, యింటివిష యాల్లోగూడ నాలాంటివాన్ని కలతపరుస్తుంది. అంచేత దాన్ని విడిచాను.

వర—అయితే యేమి జేస్తావు.

భ—యింకా నిశ్చయంలేదు. మూడుపాళ్లు బ్యాంకులో ప్రవేశిస్తాను. ఏవో కొన్ని సంఖ్యలు కలిపివెయ్యడం కొట్టివేయడం; పెద్ద ఉద్యోగం వస్తే అదీ ఉండదు. గుమస్తా దస్కతు చేయమన్న చోట చెయ్యడం. నెల అయేసరికి జీతంపుచ్చుకోడం. మన చిత్తం వచ్చినట్టు బ్రతకడం. అభిలాష ఉన్నపనులు చేయడం. అది నా జీవితవిధానం.

నర—బాగు! బాగు! నీ యజమానులను సేవించేవిధం యిదేనా.

భ—వారికి కావలసింది దే. యంత్రంలాగు నియమించిన పని చెయ్యడం. అంతకు మించి మన తెలివి ఉపయోగించి, మార్పు లేమయినా సూచిస్తే, త్వరలో ఉద్యోగంనుంచి తొలగించేమార్గం చూస్తారు. ఎందుకంటే, అలాంటి స్వతంత్రాలు క్రింది ఉద్యో గస్థులకిస్తే, వారికే ముప్పు వస్తుందని.

నర—చాలా సమంజసంగా చెప్పావుగాని మనకు అట్టిది ఆదర్శ నీయమా?

భ—బాంకుపని కింతకంటె ఆదర్శమేమిటి.

నర—సరే మనం ఎప్పుడు తిరిగి కలుసుకోడం. యిప్పుడు పరశువాకం వెళ్లి హాజరువారిని ఆహ్వానించడానికి కొన్ని యేర్పాటులు చెయ్యాలి.

భ—జగన్ మోహానుకి మన మంతా కలిసి కోమలవిలాస్‌లో విందిస్తే బాగుంటుంది. రేపు ఉదయం మా యింటికి రా. అక్కడ ప్లాను తయారుచేదాం. యింకా ఎవరైనా ఫ్రెండ్సుంటే తీసుకురా. యిప్పు డెక్కడికి?

నర—ట్రిప్లికేను వెళ్లి కాగాకిల్లీ బిగించి యింటికి పోతా.

భ—సర్ గుడ్ యీవినింగ్. నే నింకా కొంతసేపు బీదినాటకం చూడాలి.

(చెరియొకవైపు నిష్క్రమణ— తెర.)

సీను iv

(భట్టుమూర్తి యిల్లు. తలిదండ్రిని విడిచి ప్రత్యేకముగా నివసించును. అందులో డ్రాయింగురూము. గోడల చిత్రపటములు. గది మధ్య చిన్న బల్ల. అందుపై పూవులుగల పాత్రి. యిరుప్రక్కల సోఫాలుండును. భట్టుమూర్తి పేపరు చదువుచుండును.)

నర—(చిరునవ్వుతో ప్రవేశించును) గుడ్ మార్నింగ్ మూర్తి.

భ—గుడ్ మార్నింగ్. ఏమిటి బాకులాసాగా ఉన్నావు. ఊరుపోక పేపరు చూస్తున్నా. ఎడ్వర్టైజుమెంట్లు, (Advertisements) హత్యకేసుల రిపోర్టులు, కొంత రాజకీయపు చెత్త తప్ప మ రేమీ కనపడవు. యీ పేపరు చదవడం పీయర్ వేస్టు.

నర—అప్పుడే ఖండించడం ఆరంభించావు. రష్యాదేశపు నిహిలిస్టులే నాకు మతగురువులు. మీరు మొన్న మా యింటికి వచ్చినందుకు తిరిగి మే మిద్దరం మీయింటికి వచ్చేం.

భ—యిద్దరు యేమిటి.

న—మా శేషు కొంచెం సిగ్గు పడింది. వరాండాలో నిలుచుంది.

(కొంచెము నకిలించును.)

భ—ఏమిటిది. మీకు కూడా ఘోషామతం అబ్బిందే. మహామ్మదీయుల ననుసరించి కొందరు హిందువులు ప్రారంభించేరు. ఆకొందరిమతం అందరిని ఆకర్షిస్తుంది. స్త్రీల కిదొక కొత్తసంకెల అన్నిటికంటె కఠినమైంది. మాటల్లో పడిపోతున్నాం. శేషమ్మ గారిని తీసుకురా.

(నరసింహం వారి వెనక మూర్తి ఎడమద్వారంవైపు పోవుదురు. తిరిగి వత్తురు. శేషమ్మ ప్రవేశం. చామనచాయ, కాళ్లను, చేతులను, మెడలోను పూర్వపు ఆభరణాలు. చిన్నవయస్సే కాశెబిగి చీర కట్టు.)

భ—కూచోండి శేషమ్మగారు. (అందరు కూచుందురు) మమ్మల్ని పరాయివాళ్లగా భావిస్తున్నారు. అనుమతిలేంది యింటో ప్రవేశించరు కాబోలు.

శే—లేదండి యితరు లెవరయినా ఉన్నారేమోయని సంకోచించాను. యీయనగూడ చూసి వస్తానని ముందుగా వేళారు.

భ—నరసింహం! యిదిగూడ నీతప్పే. నీకు నూతనవిధానాలు ఎంత బోధించినా యీ అనాగరికత నుండి తప్పించలేక పోతూన్నాను.

న—నీ భావాలన్ని నచ్చినట్టే ఉంటాయి. కాని ఆచరణలోకి మాత్రం తేలేను. అది లోపమే గాబోలు. కాని ఈవిషయంలో—స్త్రీలు పరపురుషులుండే చోటికి నిర్భయంగా తోసుకు రావడం, వారికుండే సహజమాధుర్యాన్ని మలినం జేస్తుంది.

భ—స్వేచ్ఛగా సంచరించడం మోటుతనమా. ఏమండి శేషమ్మ గారు మీ అభిప్రాయం ఏమిటి.

శే—నాకేమి తెలుసునండీ. పూర్వపక్షాల్లో పెరిగిన దానను. వాటి ననుసరించడమే సులభంగా కనుపడుతుంది. ఈచర్చలతో స్త్రీల కేమిపని. కమలమ్మగారేం జేస్తున్నారు.

న—మూర్తి మాటలసందడిలో అన్నీ మరుస్తాడు.

భ—యింగ్లీషు చెప్పే దొరసాని వచ్చింది. చదువుకుంటుంది. ముగిసిం దనుకుంటా.

న—అయితే యిహను తొందరపెట్ట వద్దు.

భ—అదిగో వస్తుంది. మన సంభాషణ శబ్దం వినపడింది కాబోలు (ఎడమవైపుకు చూచును. కమలమ్మ మెల్లగా ప్రవేశం. మంచి రంగు. కోలని చక్కని ముఖం. కొంచెము పొడుగు. మందగమన) మీ స్నేహితురాలు శేషమ్మగారొచ్చారు.

క—(శేషమ్మనొకసారి పోయి ఏమండీ యిన్నాళ్ళకా రావడం. తీరు బడి లేదు కాబోలు.

శే—తీరుబడి లేకేం. ఏంపని ఉంది. భోంచేయడం నిద్రపోవడమే కదూ. మావారు రేపు వెళ్తాం రేపు వెళదాం అని కాలయాపన జేసేరు.

భ—నరసింహా! మూడోవారం యిందులో బాకీ నీదేనప్పు. స్త్రీలకు సహజంగా ఆరోగ్యవాంఛ ఉంటాయి. పురుషులే వాటిని ఆటంక పరచి—

న—అయితే స్త్రీ పురుషుల స్థానాలు మార్చివేసి స్త్రీలకే పురుషుల మీద అధికారం యివ్వ గూడదూ?

భ—అది మరియొక విధమైన బానిసత్వం. ఎవరి స్వాతంత్ర్యం వారి కిచ్చే ప్రయత్నం చెయ్యాలి. సరేగాని మనం మేడమీదకు పోదాం రా. యిప్పట్లో మన సంభాషణ ఆడవాళ్లకు రుచించదు. వారి సంభాషణ మనకు రుచించినా మనం దగ్గర ఉంటే మనసిచ్చి

మాటాడరు. అంచేత ఎడబాటు శ్రీయస్కరం. నా— (కుడివైపు నుంచి భట్టుమూర్తి నరసింహం నిష్క్రిమణ)

శే—మీయిల్లు ఎంత అందంగా వుంచారు. కళ్లకు ఆనందంగా వుంది. మీ వారికి చక్కని వస్తువు లంటే చాలా అభిలాష. నీవంటి చక్కని దానవు భార్యా వైనావు.

క—నా చక్కదనంతో ఆయన తృప్తి పడినట్టు కనపడరు. ఎంతసేపు నన్నొక కొత్తమనిషిగా మార్చివేయాలని ప్రయత్నమే. నామాటలు, దుస్తులు, ఆచారాలు, రుచులు, ఏమీ వారికి నచ్చినట్టు కనపడదు.

శే—నీమీదనుండే ప్రేమచేతనే మరింత విలువైన వస్తువుగా చెయ్యాలని వారి అభిప్రాయం. స్త్రీల అవస్థలను గురించి నాతో ఎప్పుడు ముచ్చటించే వారు.

క—నరసింహం గారికి కూడ ఈ అభిలాష పట్టు పడిందా.

శే—మూర్తిగారంటె ఆయనకు విపరీతమైన ప్రేమ. అంతే. నాదగ్గర ఈసంస్కరణ విషయాలేమి మాటాడరు. ఏదో గృహకృత్యాలు తీర్చుకోవడంతో మాపటి అవుతుంది. మా మేనమామ కొడుకు ఒకడు ఈమధ్య వచ్చాడు. దేహంలో స్వస్థతలేక యిక్కడ వైద్యులదగ్గర మందు పుచ్చుకోడానికి. ఆయనికి పరిచర్యలతో సగం కాలం అవుతుంది. మావారు కూడ ఉదయం, మధ్యాహ్నం వారిని డాక్టర్ల యిళ్లకు వెంబడించడంతో సరిపోతుంది.

క—బంధువులకు కష్టం వచ్చినప్పుడు సహాయం చెయ్యవద్దా!

శే—వద్దనను. కాని స్వంతవని ఎప్పుడు మాస్తారో నాకు తెలియదు. అడిగితే ఒక సంవత్సరం యిలా తిరగడం తప్ప యింకేమి లేదంటారు. నా కెందుకమ్మా వారిష్టం. నాకేం తెలుసును.

క—మావారైతే అది తెలుసుకొనే వరకు బోధించి బోధించి, కథలు

చెప్పి పద్యాలు చదివి విడిచి పెడతాను.

శే—మాటలవల్ల రాజ్యాలు జయించగలరు. యింగ్లీషువారు సామ్రాజ్యాన్ని పార్లమెంటులో అన్ని విషయాలు చర్చిస్తూనే పరిపాలన చేస్తారని నాతో చెప్పారు. మీయింటి విషయాలు ఎలాగు జరుగుతున్నాయి.

క—యింటి పనులతో నాకేమి సంబంధం లేదు. అన్ని పనులకు ప్రత్యేక నౌకర్లను నియమించారు. వాళ్ళమీద యజమాని మావారే. యింకా చాలా విషయాలు కృషి చెయ్యంది యజమానత్వానికి పనికి రానని వారి అభిప్రాయం.

శే—అయితే మరింత సుఖం. బాధ్యతలేని జీవితం.

క—అన్ని విద్యలు నేర్చుకోడమే నా బాధ్యత.

శే—అదెలాగు.

క—ఉదయం మధ్యాహ్నం దొరసాని యిం[illegible]తుంది. యేరోజు పాఠం, ఆరాత్రి ఆయనికి చదివి వినిపించాలి. ఆరుమాసాల్లో రెండు వాచకాలు ముగించాను. యింగ్లీషు భాష రానిది, నవీన నాగరికత అబ్బదంటారు.

శే—యింకా యేమిటి కార్యక్రమం.

క—జంబూనాథఅయ్యర్ సంగీతం, వీణ నేర్పుతున్నారు.

శే—మీకు హార్మోనియం తెలుసునే.

క—హార్మోనియం అంటే ఆయనకు తలనొప్పి. అదిగాక మనవేపు నేర్పించే పాటకు శృతి, లయ, తాళములు లేవని, పాట నేర్పించే విధానం భోగంమేళాల వెనకాల ఫిడేలు వాయించే వాళ్లకు తెలియదని—

శే—ఫిడేలు వాయించే వాళ్ళా.

క—వాళ్ళేగదూ తెలుగుదేశంలో సంగీత గురువులు. అందుచేత యిది

వరకు నేర్చుకున్నదంతా పూర్తిగా మరిచిపోయున్నాను. తిరిగి ప్రారంభించాను. మొదట అలంకారాలు వర్లించి, తెల్లవారు జామున గాత్రసాధకం చేసేను. బాగా పట్టుపడిన తరవాత వీణ ననుసరించి వర్ణాలు నేర్చుకుంటున్నా.

శే—మీకంఠం చాలా తియ్యనిది.

క—సహజమాధుర్యం సాధనవల్ల గాని రాణిల్లదు.

శే—మూర్తిగారి మాటలు బాగా పట్టుబడుతున్నాయి. యింకా యేమి చేస్తున్నారు.

క—మధ్యాహ్నం భోజనం తరవాత తెలుగు పత్రికలు చదువుతాను. రాత్రి ఆయన పేపరు చూడడం ముగించి వివిధ విషయాలు గురించి మాటాడతారు. అప్పుడప్పుడు ఏదో ప్రబంధం గాని భారత భాగవతాలు గాని చదివి అర్థం చెపుతారు.

శే—భర్తయే గురువైనప్పుడు విద్య వినోదంగానే ఉంటుంది. యితర వినోదాలంటే రుచించవు గాబోలు.

క—లేకేం. ప్రతి శనివారం సినిమాకు వెళతాం. నా ప్రక్కన కూచోని అర్థం చెపుతారు.

శే—మేము కూడా మొన్న సినిమాకు వెళ్లాం. మా ఆయనను అర్థం చెప్పమంటే తెలుగులో చెప్పడం చాలా కష్టం, బొమ్మలు చూస్తూంటే చాలన్నారు. మళ్లీ వెళ్లాలని లేదు.

క—అర్థం తెలియకపోతే గందరగోళమే. ఎన్ని విషయాలు తెలుసుకో వచ్చు! ఎంతో ఆనందంగా ఉంటుంది!

శే—నేను కూడా మీతో వస్తూంటా.

క—మీవారి కిష్టమైతే. తప్పక—

శే—తనకు పని కల్పించకపోతే సంతోషమంతో వప్పుకుంటారు. యింకా ఏమి చేస్తున్నారు.

క—ఆదివారం స్నేహితుల యిళ్లకు వెళ్లి ఫలహారాలు పుచ్చుకోవడం. మాయింటికి వచ్చిన వారిని గౌరవించడం. తరచు సాయంకాలం బీచికి కారులో షికారు వెళుతుంటాం. దిగి నడవమంటారు. నాకు సందేహంగా వుంటుంది.

శే—అవును. ఒకేసారి పూర్తిగా నాగరికతవస్తే ఏదైనా చిక్కు రావచ్చు.

క—ఏమిటి చిక్కు. ఈమధ్య తేనాంపేటలో పుష్పాల ప్రదర్శనానికి వెళ్లాం. పట్నంలోని పెద్దవారంతా స్త్రీ పురుషులు వచ్చారు. గవర్నరుగారు వినోద ప్రారంభ సంస్కారం చేసారు. అందరితోపాటు మేము కూడ తోటంతా తిరిగి వింత వింతలైన పుష్పసమూహాలని చూచి సంతోషించాం. మనస్సుకు మహావజాలని ఉల్లాసం యిచ్చింది. నరసింహాగారు కూడ కనపడ్డారే.

శే—చూచారా నాతో చెప్పనైనా లేదు. [illegible] వెంకమ్మకెందుకీ నూతన వినోదాలని కామాను!

క—ఎవరో స్నేహితులతో కలిసి వచ్చినట్టున్నారే.

శే—స్నేహితుల మీదుండే ఆసక్తిలో సగం నామీదుంటే బాగుండును.

క—మీకేమి లోటు, నాకొకప్పుడు యివన్నీ వృధాఅని తలంపొచ్చి బాధిస్తుంది.

శే—జీవితంఅంతా వృధాయే. ఏమిటిశాశ్వతం.

క—బిడ్డలుంటే మనపేరు ప్రపంచంలో శాశ్వతం.

శే—పెళ్లయి యింకా సంవత్సరంకాలేదు. అప్పుడే బిడ్డలతలంపేమిటి. బిడ్డలుకలిగితే యీ విద్యావినోదాలన్నీ కట్టిపెట్టాలసిందే.

క—కాని యివన్నీ ఉండి బిడ్డలు లేకపోతే.

శే—లేనివస్తువుమీదికే పోతుంటుంది మనస్సు.

క—ఆ వాంఛయేగదా! మంచిమాన్యులకు ఆధారం. (కొంచెమాగును.) ఫలహారపువేళయింది. రండి మా భోజనగదికి. వారికి మేడ మీదకి పంపిద్దాం. (ఎడమవంకచూచి) డాక్టరు రామమూర్తిగారు వస్తున్నారు. మీకుకూడా యీయనేగదు గృహవైద్యులు.

శే—అవును వైద్యులుగాదు. అన్నిసప్లయిలు ఆయనే చేస్తారు.

(డాక్టరు రామమూర్తి ప్రవేశం)

డా—ఏమండీ శేషమ్మగారుకూడ యిక్కడే ఉన్నారు. మాశారదా నావైద్యం మీమేనమామగారికి కొంచెక్కూ సహించలేదు. వందలు ఖర్చు చేసారు. ఆకుప్పుస్వామయ్యరు ఏమి చెయ్యగలిగేరు. యింటి చెట్టుమందు ఊరిపండంత విలువ.

క—మీరైతే నాలుగుమాత్రలతో కుదిర్చివుందురు. కాని ఆ చీరలకి చమ్కీ వేయించమని యిచ్చి రెండునెలలు కావచ్చింది. ఆ చీరలు కట్టుకుంటే నలుగురుండేచోటికి తీసికెళ్ళడానికి మావారు విసుక్కుంటారు.

డా—మీరు ఆ చీరకట్టుకుంటే నేమన్నా ఆ చీరకే విలువ తెప్పిస్తారు. అయినా రేపు దగ్గరుండి తయారు చేయించి తీసుకువస్తా.

క—నా మెడలోకిహారం యింకా వేశమిర్సా యివ్వనేలేదు. అది చాలా కష్టమైనపని. యిదివరకెన్నడు చెయ్యలేదని కాలయాపన చేస్తున్నారు.

డా—అదికూడా కనుక్కుంటా.

క—మరి నాజాకెట్ల మాటేమిటి. నే నేసుకొనేవి కమీజులని, శరీర సౌందర్యాన్ని కప్పిపుచ్చి వికారంగా కనపడేటట్టు చేస్తాయని అంటారు.

డా—అన్నీ ఒక్కసారేనా. అయినా వాళ్ళకి లెక్చరిచ్చి త్వరలో తెప్పిస్తా. యజమానులెక్కడ.

క—నరసింహంగారితో మేడమీదున్నారు. ఫలహారానికి లేస్తున్నాం.

(కమలమ్మ శేషమ్మలు లేచి నిలుచుందురు.)

ఇష్టమైతే క్రిందకు రమ్మనండి. లేదా మేడమీదకు పంపిస్తాం.

డా—మంచిది మేడమీదకు వెళతా.

(డాక్టరు ఒకపక్కకు వారింకొక పక్కకు పోవుచుండగా—తెర)



దంపతులు

అంకము 2

[బీచిమెరీనా 1వ అంకము మాదవసీనువలెనే. తోటలో ఉపయోగించే యినుపకాళ్ళ బెంచీ ఒకటి అధికము. ప్రవేశము భట్టు మూర్తి కమలమ్మ. మూర్తి చక్కని సూటుధరించి చేతిలో కర్రను పట్టుకొనియుండును. కమలమ్మ మరియొక వ్యక్తివలె కనబడును. క్రొత్తవిధమైన జాకెట్టు, తల పార్సీవారివలె అలంకరించుకొని, చెంకీ చీరకొంగు తలపై నిడును. జోడు ఒకటి, రెండు బంగారుగాజులు, మెడలో ఒకే హారము.]

భ—ఈ బీచి లేకపోతే యీపట్నం యేం గానుసింది. చంద్రుడు లేని రాత్రి.

క—బీచిని బట్టియేగా పట్నం యేర్పడింది. పట్టణ నిర్మాణము తెలియక పురపాలకసంఘాలు తగిన యేర్పాటులుచేయక అడ్డదిడ్డంగా పెరిగింది.

భ—అవును. వస్తువుయొక్క ఆకారం దాని జూపించేవాని నిపుణత్వములో ఉంటుంది. చూడు మనకు వివాహమై అయిదు సంవత్సరాలైంది. అప్పుడు జూచినవాళ్లు నిన్ను మధ్య కలుసుకోకుండా యిపుడు జూస్తే పోల్చనేలేరు. మరియొక వ్యక్తివై పోయేవు.

క—ఇదంతా మీ నిపుణత్వమే. కుమ్మరివానిచేతిలో మట్టివలె మీకు కావలిసిన ఆకారంలోకి మార్చుకొన్నారు.

భ—మనిషిని మట్టితో సరిపోల్చడమా? పైమార్పులకంటె లోమార్పులు విలువైనవి. దేహ సుఖములకంటె ఆత్మసుఖాలు హెచ్చైనవి.

క—నా ఆత్మనుమాత్రము మార్చలేదా? అదియే గొప్పమార్పు. విద్యావంతురాలుగా చేసారు. ప్రపంచసౌందర్యాన్ని కళల సందేశ పూర్ణంగా గ్రహించడానికి తగినశక్తిని సమకూర్చారు.

భ—నేను కొంతశ్రద్ధతో శ్రమపడి ఉండవచ్చు. నా బోధనలను గ్రహించి వినియోగములోకి తెచ్చే ఆత్మశక్తి నీలో ఉన్నది కాబట్టి నాకోరిక ఫలించింది.

క—అన్నగారు. మీతో సహవాసం చేసేవారి సంగతి మంచికి మారుస్తూనే యుంటారు.

భ—అదేమో. నేను పూనుకొని చేయలేదే. నీ విషయములో మాత్రం ప్రేమ సంబంధము కాబట్టి సంకల్పంతో కూడుకొని యుంది. మిగిలినవి అలాగా ఫలితాలు.

క—కారణములేకుండా ఫలితము కలుగదే. అన్నిటికి ప్రేమయే ఆధారం. మీరు స్నేహితుల్ని పరిస్థితుల్ని కూడ ప్రేమిస్తారు.

భ—నిజమైనప్రేమకు కారణం ఉండదు. అప్పుడే అది ప్రసరించిన వస్తువులన్నీ దివ్యంగా మెప్పిస్తాయి.

క—ఇంగ్లండునుంచి మొన్ననే తిరిగివచ్చిన జగన్మోహనగారుకూడ మీశిష్యవర్గములో చేరుతున్నారే. మొన్న గోఖ్లే హాలులో స్త్రీస్వాతంత్ర్యాన్ని గురించిన డిబేటులో మీ పక్షమే వాదించేరు.

భ—శిష్యులుకారు. స్నేహితులు. నాకు అతనికి చాలా విషయాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. కాని పాశ్చాత్యసంఘజీవితము గూర్చి బాగా తెలుసుకొన్నాడు కాబట్టి స్త్రీలకి స్వతంత్రం మనలో చాలదని నాతో ఏకీభవించాడు.

కమ—ఆదేశపు ముచ్చట్లు బాగా చెపుతారు. మనయింటికి టీకి వచ్చి రెండు వారాలైంది. తిరిగి పిలువరాదూ!

—క్రొత్తగా వచ్చాడు. అతని కాలమంతా విందులతో నిండి పోతూంది. ముచ్చటైన విషయాలు చర్చించడానికికూడా సావకాశం లభించడంలేదు.

కమ—అదిగో దూరంగా ఇటువైపు వస్తున్నారు—జగన్మోహన్ గారు.

భ—ఎక్కడ (కమలం చూపినవైపు తేరిచూచును) నీది ఎంత సూక్ష్మదృష్టి. పరిచితుణ్ని నేనుగూడ యింతదూరంనుంచి పోల్చలేను.

కమ—ఆయన్నిగురించి యిపుడే మాటాడుతున్నాం. అంచేత నిజస్వరూపాన్ని సులభంగా గుర్తించేను. (ప్రవేశము జగన్మోహన్. కొంచెము పొడుగరి. చామనచాయ. చక్కని సూటు. దొరటోపీ చేత పట్టుకొనియుండును)

జగ—గుడ్ యీవినింగ్ మేడమ్. గుడ్ యీవినింగు కమలమ్మగారు.

కమ-భ—(ఒక గొంతుతో నిరుత్సాహంతో) గుడీవినింగు.

కమ—చాలాకాలానికి మీ దర్శనం. కాని యీలాగ అకస్మాత్తుగా కలుసుకొన్నపుడే ఉల్లాసంగా వుంటుంది. మనకు తెలియకుండా తటస్థించేవే ఆనందదాయకాలు.

జగ—మీ యిద్దరిలో యెవరు మాటాడినా ఒకవిధంగా నేవుంటుంది. స్త్రీపురుషులు వ్యతిరేకకోణాలు ఆక్రమించినపుడే ఆకర్షణ హెచ్చుంటాది.

భ—అది మొదట్లో ఉండవచ్చు. కాని అనురాగంగల దంపతులకి కొంతకాలానికి ఒకరిగుణా లొకరికివచ్చి సమానమగు చిహ్నాలు పుడతాయి.

జ—ఇది అనుభవవేద్యం. నాకు యింతలో తటస్థించకూడదు.

భ—ఏమి స్నేహితుల్లోమాత్రం ఒకరి గుణాలొకరి కబ్బడంలేదా.

జ—అలాగైతే వ్యక్తైకవక్తిత్వ కృషి ఏమౌతుంది.

భ—దాన్ని పోషించడం యీ సమ్మేళనకు భంగకరంకాదు. ఒక గొప్పవ్యక్తి తన మనో బలంవల్ల ప్రపంచ పరిస్థితుల్ని మార్చివేస్తాడు. మతస్థాపకులు అలాంటివారే—జీసస్ క్రైస్టు, బుద్ధుడు.

జ—మతమంటే నాకు రుచి తక్కువ. ప్రవేశం అంతకంటే సున్న.

కమ—మన దేశంలో మతమే సంఘజీవనానికి ముఖ్యవిషయమని గంభీరవాక్యాలు పలుకుతారే.

భ—కావచ్చు కాని దాని ఉపయోగం జీవిత దినచర్యను నడిపించగల శక్తినిబట్టి ఉంటుంది. మన వేదాంతప్రబోధాలకి లౌకికవ్యాపారానికి బొత్తిగా సంబంధంలేదు.

కమ—అట్టి సంబంధం కలిగించడానికి ప్రయత్నం చేయరాదా.

భ—ప్రయత్నంవల్ల కొనసాగదు అది మతప్రబోధనలో అంతర్గతమై ఉండాలి. యీ చర్చ మోహన్‌కు రుచించినట్టు కనబడదు.

జ—రుచించకేం. మీరు ఏవిషయముగూర్చిమాట్లాడినా జీవకళలతో నింపుతారు. నిన్నరాత్రి హోటలు క్లబ్బులో డాన్సుకి రాలేదేం. మన స్నేహితులంతా మీకోసం కనిపెట్టుకున్నారు.

భ—మా నాన్నగారి యింటికి వెళ్లేం. వారే మాకున్న బంధువులు.

జ—ఎలాగైనా తప్పించుకొని రావలసింది. కమలమ్మగారికి డాన్సింగులో ప్రవేశం లేదుకాబోలు.

కమ—బాగుబాగు. ఇప్పటికే మా బంధువులంతా పాశ్చాత్యపద్ధతుల్ని అవలంబించామని దొరలైపోయామని నిరసనభావం చూపిస్తూ మా యింటికికూడా రావడం మానేసేరు.

జ—కొంత గొడవ తగ్గిందని సంతోషించవచ్చు. ఈ బానిసత్వంవల్ల

ఏమిటి ఉపయోగం.

కమ—పూర్వం చాలా లాభ ముండేది. జాతిలో ఐకమత్యము, ఒకరి కొకరు సహాయము చేయడం, విధిగా యుండేది. ఇప్పుడు మిగిలిన దనూ కొక్కటియే.

జ—(కొంచెము కోపముతో) అట్టి సంఘాన్ని త్వరలో నసింపజేయు డానికి ప్రయత్నించడమే మన విధి.

భ—కేవలము కోపంవల్ల మన భావాలు ప్రబోధం చేయలేము. శాంతంగా ఆచరణలోనికి పెట్టి చూపించాలి. మాటలలో అగౌరవం కలిగినా, ఓడిపోయినా, వానిలో జీవశక్తి యున్నదియుంటే తుదకు ఫలిస్తుంది.

జ—మీరేమి తొందరపడనవసరము లేదుకదా. ఈ బల్లమీద కూర్చుని చల్లగాలి పీలుస్తూ మాటాడదాం రండి.

(అందరూ — బల్లమీద కూర్చుందురు. మధ్యను కమలమ్మ)

జ—ఇంత విశాలమైన బీచి ప్రపంచంలో యెక్కడా లేదు.

క—ఒకేవిధంగా ఉండడంచేత కంటికి విశ్రాంతిలేదు. విశాఖపట్నం లో ఒకవైపు సముద్రాన్ని ధిక్కరిస్తూ యున్న కొండ చక్రాకారంగా ఉన్న తీరం ఇంతకంటే అందంగా ఉంటాయని నా ఉద్దేశం.

భ—గ్రహించలేనంత వైశాల్యం వల్లనే విశ్వం ఆశ్చర్యము కలుగ జేస్తుంది. అదియొక విధమైన సౌందర్యం.

క—చిన్నవస్తువులోకూడ జీవశక్తి యిమిడివుంది. మీరు విశ్వం అంత విశాలంగా ఉంటేను ఆశ్చర్యపడితే నేను యీ పువ్వు యింతచిన్న దైనా చెప్పరాని సౌందర్యముతో తాండవిస్తూంది అని నాలో మురడతాను. ఏమంటారు జగన్మోహన్ గారు.

జ—మీరు చెప్పిందే బాగుంది. ఫ్రాన్సుదేశపు పశ్చిమ తీరంలో చిన్న చిన్న పట్నాలున్నాయి. యెండాకాలంలో యూరపులోని

ధనికులంతా వినోదార్థం అచటికి వెళతారు. ఆసముద్రతీరం చిన చిన్నకొండలతోను, రమ్యమైన ఆరామాలుతోను హృదయరంజకంగా కనబడుతుంది. ఆప్రదేశాన్ని రివీరా అంటారు.

క—ఎంత చక్కనిపేరు. అక్కడి వినోదాలేమిటి.

జ—ఒక్కొక్క ఊరు ఒక్కొక్కందుకు ప్రసిద్ధి. అందరినీ సంతోషపరచడానికి విశ్వప్రయత్నాలు చేస్తారు. సాధారణంగా నలుగురైదుగురు కలిసి యీ యాత్రలు సాగిస్తారు. స్త్రీ పురుషులు గంటల కొలది సముద్రంలో స్నానము చేస్తూ, ఆసమయాన్ని వివిధమైన జలక్రీడలు సలుపుతారు. తరువాత ఒడ్డున అందుకు ప్రత్యేకంగా నిర్మింపబడిన చిన్నకుటీరములలో విశ్రాంతి పొంది అల్పాహారము పుచ్చుకొని యెవరికిచ్చిన వినోదాలకి వారు వెళతారు.

క—ఏవిటా వినోదాల్లో ముఖ్యమైనవి.

జ—నాటకాలు, సినిమాలు, సంగీతాలు.

క—అవి ప్రతిపట్నంలో ఉన్నవేకదా.

జ—నిజమే కాని మంచి విగ్గవి ఏవి ఎరిగిస్తారు. రాత్రులు పెద్ద హోటళ్ళ ఉద్యానవనాల్లో డాన్సులు యేర్పాటు చేస్తారు. చక్కని వాద్యాలు సంగీతము ఉంటుంది. అతి సన్నమైన ధ్వానాలు భుస్తూ దాంపత్యాలు లోపలవలా సంగీతాన్ని ఆమోదిస్తూ యువజనులు నృత్యములచ్చే సౌఖ్యాన్ని పరిగ్రహిస్తూ. హోటలను వింత వింత రంగుల దీపాలతో అలంకరించి సేవకులు కూడ చిత్ర విచిత్రమైన దుస్తులు ధరిస్తారు. కొంతసేపు అచట కూచొనేసరికి యిది స్వర్గలోకమా, గంధర్వలోకమా అని మనస్సుకి తోస్తుంది. ఒకవిధమైన ఉన్మాదం వస్తుంది. ఇంకేమి చెప్పను. భాగ్యమూర్తిగారి వలె కవిత్వ పరివేశం లేదు. లేనియెడల బాగా వర్ణించియుందును.

క—ఉహా వర్ణింపంచనిరాకరణానికి కూడ స్వానుభవము వున్నాది ఉం

వాలి గదా. అది లేనిది పిచ్చివాని ఊహాలువలె ఉంటాయి.

భ—"రవిగాననిచో కవిగాంచును గదా" అని చెప్పరే.

క—మీరే చెప్పారు. అది ఉత్ప్రేక్ష అని. జగన్మోహన్‌గారి వర్ణన కవిత్వ రచనకు మించి యుంది. ఏమండీ అట్టి వినోదాలు ఇంగ్లండులో లేవా.

జ—లేకేమి. బ్రైటన్ మొదలైన సముద్రతీరపు పట్నాలు కేవలం వినోదార్థమే నిర్మించ బడ్డాయి. లండన్ నగరము నుంచి ప్రతి ఆదివారం అనేకులు వెళతారు. రైళ్లలో స్థలముండదు. రోడ్లు మోటారుకార్లతోను, బస్సులతోనూ, నిండి పోతాయి.

క—వారంతా ధనవంతులు కాబట్టి వీలుబడి యుంటుంది. విచ్చలవిడిగా ఖర్చుచేసే సామర్థ్యం ఉంది.

జ—మనదేశంలో కూడ ధనికులు వేనవేలున్నారు. వారికీ తలంపులు లేవే. దేశముయొక్క పరిస్థితులు ఆదేశస్థుల సాంఘిక సంకల్పాన్ని బట్టి యుంటాయి.

భ—ఒకని సంకల్పమువల్ల కూడ దేశము మారిపోవచ్చు. నెపోలియన్ చక్రవర్తి తన సైనికు లందరినీ తన మనోబలముచే నింపగా చిన్న భటుడుగూడ మూర్తీభవించిన యుద్ధదేవుని వలె పోరాడే వాడు.

—ఆవిధంగానే కొందరు సైనికులు మూర్తీభవించిన పిరికివందలాగు పరుగెత్తుతారు.

భ—అది వారి సైన్యాధిపతిని బట్టి. కాని నీతో ఒక విషయం చెప్పాలి నాస్నేహితు డొకడు వీరరసప్రధానమైన నాటకాన్ని రచించాడు. దానిని మాయింట్లో ప్రదర్శించా లనుకొంటున్నాము. మీరుకూడ పాత్ర ధరించాలి. ఏమంటావు కమలా.

కమ—ఔను. అందులో విజయమార్తాండుని పాత్ర వీరికి బాగా కుదు

ర్తుంది.

జ—నాకు సంగీతం రాదే. ఇంగ్లీషునాటకాల్లో వేషము వేసానుగాని తెలుగంటే భయం.

భ—ఈ నాటకంలో సంగీతం లేదు. ఈమధ్య వచననాటకాలు వృద్ధి చేసే తలంపుతో ఒక చిన్న కమిటీ ఏర్పాటు చేసాం. అవి సంభాషణాభాషలో రాయుట. పద్యాలు పాటలు లేకుండ కేవల కల్పితాలై యుండాలి. అంతే నిబంధన. అయితే అట్టివి పట్నంలో ప్రదర్శించడానికి తగిన ప్రోత్సాహం లేదు. కొందరి స్నేహితుల ప్రోత్సాహంమీద మా యింట్లో చిన్న స్టేజ్ ఏర్పాటు చేసాం. ఎవరైనా కొత్త నాటకం వ్రాసి మన కిస్తే కమిటీవారంగీకరిస్తే ప్రదర్శించడం. ప్రేక్షకులు ప్రదర్శకులు మనమే.

జ—చాలా వినోదంగా యుంటుంది. నాకు చిన్నప్పటినుంచీ నాటకాలంటే అభిలాష.

కమ—అయితే ఆ పాత్ర ధరించడానికి ఒప్పుకొన్నట్టే. ఈవిధంగానైనా మా యింటికి తరుచు వస్తూ ఉంటారు.

జ—మీవంటి విద్యావంతులైన స్నేహితుల సాంగత్యం నా కిచట దొరకడం ఏంగాను. అదీగాక మీ పాట వినాలని కుతూహలంగా ఉంది. వీణకూడ యింపుగ వాయిస్తారట.

కమ—సంగీతం అంటే యిష్టం లేనట్టు యిప్పుడే చెప్పరే.

జ—నాకు రాదని చెప్పేనుగాని అందులో రుచి లేదని కాదే.

కమ—మీ కిష్టమైనపుడు రావచ్చు అంత గొప్పపాట కాదు. అయినా—

జ—ప్రతిదినం వస్తాను మీ కభ్యంతరం లేకపోతే.

భ—మా ఉభయులకూ సంతోషమే. నరసింహం దంపతులుకూడ రేపొసారు. మీరూ వస్తే నాటకం చదివి వినిపిస్తా.

అలాగే.

(ఈ సంభాషణ జరుగుచుండగా మెల్లమెల్లగా చీకటి పడుచుండును)

భ—చీకటి పడుతుంది. మీరెక్కడికి—మా కారులో రండి. మిమ్మల్ని విడిచి యింటికి పోతాం.

జ—థ్యాంక్స్. నన్ను మౌంటురోడ్డులో విడువండి.

(ముగ్గురూ నిష్క్రమింతురు)

(వారు స్టేజి దాటినవెంటనే మోటారు హారన్ వినబడును. అప్పుడు తెర.)

సీను ii

(భట్టుమూర్తి యింట్లో డ్రాయింగు రూమ్. వెనుకగదిలో రిహార్సలు జరుగును. జగన్మోహన్ యెడమవక్కనున్న సోఫాపై కూర్చుని సిగరెట్టును వెండి కేసునుండితీసి—కమలమ్మ కుడివైపు సోఫాపై కూర్చుని అల్లుచుండును.)

జ—సిగరెట్ (చేతిని కమలమ్మ వైపు చూపును.)

క—నేను సిగరెట్టు కాల్చనని మీకు బాగా తెలిసినా మాటిమాటికీ నాకందించ ప్రయత్నిస్తారు. పదిమందిలోను యిస్తే ఏమనుకుంటారు.

జ—సిగరెట్టు అభ్యాస ముందనుకుంటారు. లోకులమాట మీకింత వెరపనుకోలేదు. అయినా క్షమించండి. ఇకెన్నడూ యివ్వను. మీకింత అరుచిఅయితే నేనుకూడ కాల్చను.

(తిరిగి సిగరెట్టును కేసులో పెట్ట సూచించును.)

క—మీరెందుకు మానడం. పొగ సహాయము లేనిదే ఆలోచనా ప్రవాహం పారదుగా.

జ—అది మోటు తరంగల మగవారికే వర్తిస్తుంది కాబోలు.

క—అయితే సిగరెట్లు కాల్చే దొరసానులు మోటువారా!

జ—మిమ్మల్ని ఒప్పించలేను. (కొంచమాగి తనచేతి గడియారంవంక జూచి) ఏమి ఒంటిగంట కావచ్చిందే నాటకం రిహార్సలుకు.

స—ప్రకాశం సూర్యంతప్ప యెవరూరాలేదు. మూర్తి వీరికోసం మోటారుకూడా తీసుకెళ్లేడు మొదట మాయింటికివచ్చి—

క—అదినాకు తెలును. యీయనకొక్కరికే యీ నాటకం అవస్థ. ప్రతి రిహార్సలుకీ పాత్రధరించే వారందరినీ వారియిళ్లకు వెళ్ళి పిలిచి వెంటవేసుకొని తీసుకవచ్చి ఫలహారాలిచ్చి నటులచేత కాని వాళ్ళచేతకూడ, ఆహా ఏమి బాగా యాక్టుచేశావని హెచ్చరికచేసినా యింకా యెవరిపాట్లువారికి కరతాళాలైనా రావు. అందించినా అందుకోలేని స్థితిలో ఉన్నారు.

జ—నేనూ అందులోనే జమ.

క—లోకేం సైన్యాధిపతులు. గంభీరస్వరంతో సైనికుల్ని హెచ్చరిస్తూ కరవాలం పైకెత్తి విజృంభించి స్టేజిమీద గంతువేసేసరికి కరతాళ ధ్వనులతో గొల్లుమని కేకలతో నాటకశాలలోని వారంతా అభినందిస్తారు. అంతటితో సమాప్తి. మూకమ్మంలోనే మోటు.

జ—(నవ్వుచూ) మీరుకూడా చిన్న పాత్రయేగా.

క—ఈనాటకం వీరరసప్రధానం. కాబట్టి స్త్రీలకందులో ప్రాముఖ్యత లేదు. మొదటినుండి ప్రతాపరుద్రీయంలో స్త్రీలకు వేషంవేసుకొని స్టేజిమీద నిల్చోడంతప్ప యింకేమీపనిలేదు.

జ—ప్రధానరసం ప్రణయము అయితేనే గాని స్త్రీలకు ప్రాముఖ్యత రాదు. అందుచేతే బెర్నార్డుషా ఆరసం లేకుండ నాటకాలు రచించ వచ్చినాడు.

క—తన ముఖ్యనాటకాల్లో మాత్రం ఆ రసాన్ని యిమిడ్చాడు.

పూర్తిగా లేని నాటకం సెంట్‌జాన్‌లో స్త్రీయే ముఖ్యపాత్ర.

జ—మీకింత జ్ఞానమున్నందుకు పాశ్చాత్యకథయేటన్న స్వయంగా చూడాలి. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్కవిధమగు కళాపూరితమైన నాటకాలు.

క—చాలా వరకూ చదివేను కాని ప్రదర్శనం చూడకుండ రసం గ్రహించలేం.

జ—అయితే నేను లోగడ మీకు చెప్పిన విషయమై యేమి నిశ్చయించారు.

క—ఏ విషయం.

జ—నేను తిరిగి పదిహేను రోజులలో ఇంగ్లండు వెళతాను—ఉద్యోగ ప్రయత్నమై. నాతో మీరు కూడా వస్తే యూరప్ దేశంలోని ముఖ్యపట్నాలకి పోవచ్చు. అచ్చటి విశేషాలు కనులారా చూస్తేనే కాని జీవించిన ఫలం లేదు.

క—అవును. మొన్న చిత్రపటముల ప్రదర్శనానికి వెళ్లాం. అందులో కళాసౌందర్యం కల దొక్కటి లేదు. పోన్సులూవరులోని చిత్రపటములు, ఇటలీ దేశపు చిత్రపటములు, శిల్పములు చూచి ఆనందించ దానికైనా యూరప్ పోవలసిందే. మన దేశంలో షాజహాన్ అవ్యాజప్రేమకు శాశ్వతసూచకమై భవనరాజమైన టాజమహాలుని గాని, అజంతా చిత్తరువులు గాని చూడలేదు గదా. నాకు యితర దేశాలు కూడానా.

జ—ఏమి యీరోజులలో ప్రయాణం యెంత సులభం. ప్రతీ పట్నంలో మన స్వగృహం కంటే సదుపాయంగా ఉంటుంది. ఇక స్త్రీలకు రైల్వే ప్రయాణాలు సుఖప్రదమే.

క—ప్రయాణమంటే నాకు చాలా వేడుక, కొత్తమనుష్యుల్ని కలుసుకోడం, రోజుకొక వింత చూడ్డం, కొత్తపట్నాలు ప్రకృతి విశే

పాల్లు కనిపెట్టడం హృదయరంజకం గదా.

జ—ఇన్ని కుతూహలమైన ఊహాలు కలదానవు నాతో రాగూడదా. మూర్తి సమ్మతింప డనా?

క—ఆయనతో యీవిషయమై ప్రసంగించాను. నాకిష్టమైతే ఆయన కిష్టమే అని చెప్పారు. ఇదివరకు యూరప్ దేశం బాగా అలవాటు పడినవారు గాబట్టి మీకు విలువైన మార్గదర్శకులే అన్నారు.

జ—ఇంకేమున్నది. ప్రయాణం నిశ్చయమన్నమాటే. నా జీవితంలో అనేకులతో స్నేహంచేసాను అనేక సంతోషదినాలు గడిపేను కాని మనదేశం తిరిగి వచ్చినప్పటినుంచీ మీస్నేహం లభించి నప్పటినుండీ నా జీవితం రమణీయమై పోయింది. హృదయానికి ఒక క్రొత్తవికాసం లభించింది. ఇపుడు మీతో చెప్పక తప్పదు. మిమ్మల్ని రమ్మనడంలో కొంత స్వార్థంకూడా ఉంది. ఇపుడు మిమ్మల్ని విడిచివెళ్ళడం యేమీ మనస్కరించచలేదు. జీవితం దుర్భరమై పోతుంది.

క—స్నేహితులకు మీకే మెడబాటు సూచించనపుడు ప్రీతినిమిత్తం నాసుఖాన్ని కోరుచూ నాశరీరాన్ని ఆత్మని తనదిగా భావిస్తూ అవిరళమైన ప్రేమతో నన్నాదరిస్తూయున్న నాభర్తను విడిచి యేలారాగలను. అదియే నాసమస్య.

జ—(కొంచెము సందేహముతో) ఆయనమాత్రం రాకూడదా.

క—ఆయన రావీలులేదని యిదివరకే మీకు చేప్పెను. మీకు తెలును.

జ—క్షమించాలి. నాఆత్రుతలో కంగారుపడ్డాను.

క—ఆతృతెందుకు.

జ—ప్రపంచ సౌందర్యాన్ని మానవనిర్మితమైన కళా మాధుర్యాన్ని పూర్తిగా గ్రహించడాన్కి మీవంటివారు తోడుగాఉండాలి.

6

(భట్టుమూర్తి, నరసింహం, శేషమ్మ, డాక్టరు రామమూర్తి ప్రవేశం.)

భ—(కూర్చుని) వీళ్ళందర్నీ జతపర్చి తెచ్చేసరికి నా తలప్రాణం తోకకొచ్చింది. మిగిలిన వాళ్ళెక్కడ.

శ—హాల్లో నిద్రపోతున్నారనుకొంటా. ఇకనెందుకు కాలస్యం. రిహార్సలు ప్రారంభించండి. ప్రహారపు సమయం కావచ్చింది. అది ముగిసిం తరువాత తనుకొంటే బీదిబై మారుతుంది.

న—చూడేగిదూ మొక్కటంకం. శేషుకి యింకా నలుకుపోలేదు. వేషం వేసి అసలు స్టేజి మెక్కనికి సర్దుకుంటుందని హెచ్చరిక చేస్తున్నా.

శే—ఏమైనప్పటికీ ఆ బూడిదమాత్రం మొహానికి రాసుకోను. తగువాత ఆకరుసీనులో నాచేయి యెవ్వరూ పట్టుకోవద్దు. నే చెప్పవలసిన నాలుగుముక్కలూ గడగడ అప్పచెప్పేసి వక్క కురికేస్తాను.

నర—అదుగో మేంచ్ చెప్పినట్టు వినాలిగాని నీ కిష్టం వచ్చినట్టు చేస్తే రసాభా సవుతుంది.

శేష—అయితే నాకీ వేషంగొడవక్కనే వద్దు.

భ—అతనితో యేం లెండి. మీకు యేంగాను వీలుగా ఉంటే అలాగే సాగిద్దాం. రండి డాక్టరుగారు. మీ మామూలు వేషమే మీ పాత్రకు చాలు. ప్రత్యేకంగా నాటకానికి వేషం వేయనక్కర లేదు.

డా—అంచేత నన్నెరిగినవాడే ఆ పాత్రని నాటకంలో యెక్కించాడనుకొంటా.

భ—సరే. మొదట శ్లోకాన్ని చదువుతూ మీరు ప్రవేశించాలి.

(మోహన్ కమలమ్మలు తప్ప మిగిలినవారంతా లోనికి పోవుదురు.

డాక్టరు యేదో గొణుగుకొనుచూ వెంటాడును. మోహన్ లేచి కమలమ్మసోఫాపై కూర్చుండును.)

కమ—మనం తరవాత వెళ్లవచ్చు. మూడవఅంకంలోనేకాదూ.

జ—బాగానే కుదిరింది. మీదీ అక్కడే ప్రారంభం. ఏమిటి ప్రయాణం నిశ్చయం అన్నమాటేనా? ఈవేళ మన స్నేహితు లందరితో చెప్పవచ్చు. రేపు ప్రయాణసన్నాహం చేదాం.

కమ—అంత తొందర ఎందుకు? సరియైన ఆలోచన యింకా కుదర లేదు. అదిగాక మా తలిదండ్రులకి తెలియజేయాలి.

జ—ఎందుకు?

కమ—ఇంత దూరప్రయాణం చేసేముందు వారి యనుమతి పుచ్చుకుంటే శ్రేయస్కరం. బయలుదేరేముందు వారి నిక్కడికి పిలువనంపాలి.

జ—నా కింతమాత్రం ఒప్పుకోను. అది మీరు కల్పిస్తూన్న మిష.

కమ—విమలతో మన కేంపని. పూర్తిగా యిష్టం లేకపోతే తిన్నగానే చెప్పేనుందును. వార్ని అనుమతి మొదట కోరి, యివ్వనపుడు వేరుమార్గం ఆలోచించాలి.

జ—మీరు దృఢసంకల్పం చేస్తే యివన్నీ అక్కరలేదు.

కమ—మీతో రావడం అంటే నాకూ యిష్టమే గాని—

(డాక్టరు రామమూర్తి ఎడమద్వారమువద్ద ప్రవేసించి అచ్చటనే నిలిచి)

డా—మీరుకూడా రావాలి, ప్రాణ్మింగుకు యెవరూ లేరు (అని త్వరలో నిష్క్రమించును.)

(మొదట కమలమ్మ, ఆమె ననుసరించి జగన్మోహన్ కుడిపక్కనుండి యెడమద్వారము వంకకు పోవుదురు. రంగస్థలం మధ్యకు వచ్చు సరికి కొంచెము త్వరితగతితో మోహను కమలమ్మను చేర

పోయి ఆమెను కౌగిలింప దలంచి వెరచిన ట్లగపడుచూ తొట్రుపా టుతో ఆమె మెడపై వెనుకభాగమందు అంటీ అంటని ముద్దుపెట్టును. కమలమ్మ చప్పున వెనుకకు తిరిగి చూచును)

క—అదేమిటి. (ఈమాటలు చెప్పునరికి నరసింహం ప్రవేశించును. కొంచము తడబాటుతో చెదరిన చూపులుగల కమలమ్మ జగన్మో హనులను తేరిజూచును. ఎవరునూ మాట్లాడక ఒక్క నిముష మూరకుదురు.)

న—మానీను యీవాళ రిహార్సలు లేదు. కొంచం విశ్రమిస్తా. కమ లమ్మగారూ మీరే ప్రొంప్టు చేయాలట. మూర్తిగార్కి యింకెవరి చేతా నచ్చడం లేదు.

(కమలమ్మ అంగీకారము సూచించునట్లు తలయూచి మొదమ ద్వారం గుండా నిష్క్రమించును)

న—కూర్చోండి జగన్మోహన్‌గారు మీ కాల మింకా సమీపించ లేదు.

జ—ఏమికాలం—ఇక్కడ ఊరకనే కూర్చోడం విసుగ్గా ఉంటుంది. ఆ రిహార్సల్ గొడవ చూస్తా మీకభ్యంతరం లేకపోతే.

(జగన్మోహను తల వంచుకొని కమలమ్మ పోయిన దారినే పోవును)

న—ఇచ్చట మరియొక నాటకం తయారగు తున్నట్టుంది. వీరి నడ వడిక నాకేమీ అర్థం కాలేదు. అయినా తొందరపడి తీర్పుకు రాకూడదు.

(డాక్టరు రామమూర్తి ప్రవేశం)

డా—రిహార్సల్ మాటకేం గాని ఆకలి సహించుకు పోతూంది. యింతలో తేలేటట్టు లేదు. మీరూ అలసినట్టు కనపడుతున్నారు. ఎవరికీ తెలియకుండా కాఫీహోటలుకు జారి పద నిముషాల్లో

తిరిగి వచ్చేదాం రండి.

న—ఈమాత్రానికి దొంగతన మెందుకు మూర్తికి తెలిసిం దంటే చాలా నొచ్చుకొంటాడు. నౌకరికి చెపితే వాడే కాఫీ యిస్తాడు.

డా—నీ యిష్టం.

న—డాక్టరుగారూ మీరు మా మిత్రవర్గం లోనివారే. మూర్తికీ నాకూ యెంత ప్రాణస్నేహమో మీకు తెలుసును గదా. మీ రెవ్వరైనా సలహాకొరకు రహస్యం చెపితే అదెక్కడికీ పోదని నాకు తెలుసును. అయినా యీ విషయంలో మరింత జాగ్రత అవసరం. కాబట్టి పరమ రహస్యంగా ఉంచాలని నా కోరిక.

డా—అలాగే కానివ్వండి.

నర—ఇపుడు—నేను—గదిలోకి వచ్చేసరికి వాళ్ళిద్దరూ—కమలామోహనులు—వింతస్థితిలో ఉన్నట్టు కనపడ్డారు. ఏదో విశేషం జరిగుండాలి. నన్ను చూచి కళవళపడి గడబిడై పోయారు. నాకు సరిగా అర్థం కావడంలేదు.

డా—కళ్ళతో చూచినవారికి మీకే అర్థం కానపుడు నే నేమి చెప్పగలను. ప్రతిదినం కోర్టులో అనేక వ్యవహారాలు నడిపిస్తూంటారు. బుద్ధిసూక్ష్మతకు యేమిటి లోటు.

నర—దానికేంగాని మూర్తినిగురించి నాకు చాలా ఆందోళంగా వుంది. ఇలాంటి ఉద్రేకాలు పెరిగితే అందర్నీ చుట్టుకుంటుంది. మనము స్నేహితులంకాబట్టి అతనికి నిజాన్ని తెలియపర్చి జాగ్రతపడమని హెచ్చరించవలసియుంటుంది.

డా—సరిగా అర్థం కాలేదని మీరే చెప్పేరు. ఏమీ లేందే తొందరగా ఊహాప్రవాహ సహాయాన్ని లేనిపోని అనుమానాలు తెచ్చిపెడుతున్నారు. మనం కలుగజేసుకోడం, యిలాంటి విషయాల్లో హానికే కారణం. అదిగాక చివరకు చెడ్డపోతాం.

నర—అలాంటి భయంవల్ల మన పవిత్రమైన విధిని మానడమా. ఇది కేవలం పిరికితనం.

డా—ఏమి జేసినా మీ స్వబాధ్యతమీద చెయ్యండిగాని నన్ను మాత్రం యిందులో దింపకండి.

న—మీరింత భయపడతా రనుకోలేదు. పూర్వీలు నియమించిన కట్టుబాట్లను ధిక్కరించడంవల్ల ఫలిత మిది. అయినా మా శేషు నడిగితే కొంత మార్గం యేర్పాటు చేస్తుంది.

డా—ప్రపంచ మంతా వెల్లడి చేయదలచాలంటే అంతకంటే మంచి మార్గం లేదు. ఏకాంతంగా యీ సమస్యలని మీరు చర్చించ వచ్చు. రండి కాఫీ పుచ్చుకుందాం.

(ఇద్దరునూ లేచి యెడమ ద్వారముద్వారా లోనికి పోవుదురు. రెండు నిముషములతరువాత కమలమ్మ దీర్ఘాలోచనతో ప్రవేశించును. కుడివైపు సోఫాలో కూర్చుని ఆలోచించుచుండును.

జగన్మోహన్ యేమియు జరుగనట్లు ధైర్యముఖమును వహించి ప్రవేసించి యెదురుసోఫాపై కూర్చుండును.)

కమ—మీ వింతచర్యకు తగుసమాధానం యిప్పుడైనా చెపుతా రను కొంటా.

జ—ఏమి టంత కోపదృష్టితో చూస్తూన్నారు. సమాధాన మెందుకు చీమతలకాయని యేనుగుతలకాయను చేస్తున్నారు. ఊరక హాస్యానికి.

క—నియమవిషయాల్లో యెంత చిన్న అతిక్రమణ అయినప్పటికీ గొప్పతప్పుగా భావించాలి. ఆవంత సందీయకూడదు. ఇందేమీ హాస్యంగా కనబడ్డం లేదు. అందులో స్త్రీని అనుమతిలేకుండా ముట్టుకోవడం చిన్న విషయమా.

చిన్నముద్దులో యేముంది. అనుమతి యిప్పు డీయకూడదా.

క—మన సంభాషణ హద్దు మీరుతున్నది. మీరు పశ్చాత్తాప పడుతారని మీతో యీ ప్రసంగానికి దిగేను కాని తిరిగీ చిల్లర ప్రణయంగా మారుస్తారని కాదు. దీన్ని పెంచడం వృథా—

జ—క్షమించండి, క్షమించండి. ఈ గ్రాసం దానికే మనస్నేహం పాడు చేయడమా. ఇతరు లెవ్వరూ చూడలేదు లెండి.

క—నా నడవడిక, అన్ని విషయాలు, అందరూ చూడ తగినవే. దాపరిక మనవసరం. మీ చర్య నాకర్థ మగుట లేదు.

జ—నిజము చెపుతాను. ఆ నిముషంలో అపరిమితమైన ఆపుకోలేని వాంఛ కలిగింది. నా మనస్సుయొక్క అనుమతి లేందే నా శరీరం అట్టి పని చేసింది. జరిగిన ఉత్తరక్షణంగా మేలుకున్నా. దానిని సర్దుబాటు చేయడం కోసం యింతవరకూ ప్రయత్నం చేసాను. సాగింది కాదు.

క—ఉద్రేకమైన వాంఛల వల్లే మనుష్యులు గొప్ప నేరాలు చేస్తారు. మీవంటి విద్యావంతులు యింద్రియనిగ్రహం ప్రత్యేకకృషి చేస్తారే.

జ—నాకు యీవిషయంలో విద్యాసహాయం ఉన్నట్టు తోచదు.

క—సరే, యింతటితోనైనా మన ఉభయులం కలిసి యూరోపుదేశ సంచారము చేయడము కుతూహలం పోయిందా?

జ—దీనితో సంబంధ మేమిటి. అది నిశ్చయంగానే యిప్పటికీ తలుస్తా.

క—ఏమివింత. ఆ సంచారంలోని ప్రవర్తనకిది ఉపోద్ఘాతం కాబోలు. మన యిద్దరికథా చక్రాన్ని ప్రబంధాలాగ యింతవరకూ సాగించి. దానిని మీ ఉద్రేకంచేత నాశనం చేసారు.

జ—ఈ ఒక్క పొరపాటు క్షమించండి. దొరలలో అన్నలు తమ చెల్లెళ్లను ముద్దాడుకోరా. అవిధంగా తలంచరాదా.

క—అనుకోవచ్చు. కాని అది ప్రేమకారణంగా సమ్మతిని జరిగేది.

ఇపుడు మనం కాఫీకి పోవచ్చు.

శ—నన్ను క్షమించలేదే. మన పూర్వ స్నేహమైనా తలంచి తిరిగి మిత్రునిగా భావించమని నా కడపటి కోరిక. కొన్నాళ్లు పరీక్ష చేసిన తరువాత ప్రయాణవిషయమై ఆలోచించవచ్చు.

క—మానవ జీవితం పరిస్థితులవల్లనే కదా మారుతూ ఉంటుంది. ముందేమి రానున్నదో నే నూహించలేను. నామట్టుకు నిర్ణయం దిపుడేమీ కోపంలేదు. ఇతర విషయాలేమీ ఆలోచటంలేదు. నా భర్తకు తెలిస్తే యేమనునో, తెలియకుంటే యేలాగు (లటూలున లేచును యెడమద్వారము వంక పోవుచుండగా జగన్మోహన్ దూరముగా అనుసరించును. వారిరువురూ నిష్క్రమించుచుండగా తెర)

సీను iii

(నరసింహం యింట్లోగది. గోడలను క్యాలండరు బొమ్మలు, రెండు కేన్వాస్ కుర్చీలు, ఒకకర్రకుర్చీ ఎడమకుడివక్కలను ద్వారములు. కుడివైపు వంటగది ద్వారమునుండివచ్చు పొగనుబట్టి ఊహించవచ్చును. ఎడమద్వారమునుండి నరసింహం కోర్టు కాగితములు కట్ట పట్టుకొని ప్రవేశించును.)

—శేషూ, శేషూ (శేషమ్మ కుడివైపు ద్వారమునుండి పట్టువంచ మడిచీరగా కట్టుకొని ప్రవేశం.)

—ఈవేళ నేను భోజనానికిరాను. బానుకిపోయి ముగట ఆ పెద్దమ్మడగుకి కేసు చెప్పాలి. ఉదయమే శ్రమపడిలేచి అతనింటికి వెళితే యిప్పుడే ఆఫీసుకి పోయాడన్నారు. పాలోమంటూ అక్కడికి పోవాలి. భోం చేయడానికి యింకా వేళ కాలేదు. బానులో భోం చేస్తాను.

శే—మీకు సమయం చిక్కినప్పుడల్లా యితరచోట్లనే భోం చేస్తారు. ఇంటి భోజనం కంటే హోటేలు భోజనం రుచి. నావంటంటే మరీ రుచితక్కువ.

న—ఎప్పుడూ యీలాంటి మాట్లాడతావు. సరిగా చేసినప్పుడు మెచ్చుకొనేవాణ్ణి కాదా.

శే—సంవత్సరానికొకసారి. ఇప్పుడు పెద్ద ప్లీడరుగారు మీరు బోధించకపోతే నేను తెలియదు కాబోలు.

న—అంతా ఒకపాట్లు. మేము బోధించేది లేదూ, వారు గ్రహించేదీ లేదు. పార్టీలను సంతోష పెట్టడానికి వాళ్ళ వెనకతిరిగి దీర్ఘాలోచన చేసినట్లు నటిస్తూ చేతు తిరగవేస్తూ ఒక్కొక్క విషయం చర్చించి ఖండించి పారేస్తాం. కోర్టులోకూడ పక్కనకూర్చుని తుమ్మెదలాగు వాళ్ళ చెవిలో కేసు జరిగినంతసేపూ ఘోషచేస్తూనే ఉంటాం. కొందరు సీనియరు జడ్జీలు వాళ్ళమీద పడినప్పుడు వెనక్కి తిరిగి మామీద పడతారు.

శే—ఎప్పుడూ తొందరపనులే అంటారు. సంపాదనేమీ కనపడదు. ఆ కమలమ్మగారికన్న హారంలాంటిది చేయిస్తానని మూడు సంవత్సరాలనుంచి చెపుతున్నారు. అంతే.

న—ప్లీడరీ అయిదు సంవత్సరాలనుంచేగా చేస్తున్నాను. అదింకా ఆరంభం అన్నమాటే. చిరకాల జీవికే యీ వృత్తి సదుపాయం. భట్టుమూర్తి వాళ్ళ బ్యాంకు తరఫున కొన్ని కేసులు యిప్పిస్తానన్నాడు.

శే—ఏమిటీ! రిహార్సల్ రోజున అంత ఆందోళనగా కనపడ్డారు!

న—ఆ విషయమై నీతో మాట్లాడ తలంచుకోలేదు. క్రొంచమాగి అయినా మొత్తుకున్నాం కాబట్టి—కమలమ్మ వ్యాపారం సవ్యంగా లేదని నా అభిప్రాయం.

అభిప్రాయంతో లెక్కించుటి. నష్టంగా లేకపోవడం యేమిటి.

న—నే నొక చిన్న ప్రదర్శనం చూచాను. జగన్మోహన్‌కు ఆమెకు— ఏదో జరిగినట్లు నాకు నిశ్చయంగా తోస్తుంది.

శే—నే నేమీ నమ్మను. ఇలాంటి ప్రసంగాలు మానండి.

న—నాకుమాత్రం వారియందు స్నేహభావాలు లేవనుకున్నానా. నిన్నేదో సలహా అడుగుదామనుకుంటే నన్ను నిందిస్తావేమిటి.

శే—లేని పోని అనుమానాలు తెచ్చిపెట్టుకున్నందుకు నిందించాలా, ఖండించాలా. ముఖ్యస్నేహితులం మనమే యిలాంటివి అంటే, యిక మనప్రవర్తన నచ్చని వాళ్ళేమనా అంటారే.

న—ఏమో—ఈ స్త్రీ పురుషుల స్వేచ్ఛ సంచారం నాకేమీ మనస్కరించడంలేదు. ఇప్పటికైనా, కట్టిపెడితే బాగుంటుంది.

శే—నాకుమాత్రం యీవిధసంసర్గాలు సరా, కాని యీవిషయం మన స్నేహితులు కానవిషయం. మనము చేయవలసినపని స్పష్టమే. లోకోపవాదులకి యెడం యిచ్చినట్టుంటే యిప్పుడే నశింప చేయాలి.

న—కాని యీవిషయం మూర్తి చెవినిగాని, కంటగాని పడితే—

శే—ఏమియుం పడ్డాక్క పడినా సమ్భాళించుకొనే శక్తి కలవాడు. అయినా మీ యనుమానం వట్టిది. జగన్మోహన్ పాశ్చాత్య దేశాల స్వాతంత్ర్యానికి అలవాటు పడినవాడు కాబట్టి విద్యావంతురాలైన కమలతో కొంత విచ్చలవిడిగా తిరుగవచ్చు. అందులో తప్పేమిటి.

నర—నామాట విను. వీణ వినడం మిషతోను, నాటకాలకి ప్రదర్శనాలకి పోవడంకోసరకు, యితర సంభాషణలకు, జగన్మోహన్ ప్రతి రోజూ మూర్తి యింటికి వెళ్ళడం; తరుచు అక్కడ భోజనం, టీ,

వచ్చారు; మూర్తి లేనప్పుడుకూడ వాళ్ళిద్దరూ కలిసి వీధికి వెళ్లడం; తరువాత మోహన్ యింగ్లండుకి వెళితే కమలమ్మ ఆయనకూడా వెళుతుందని వదంతిగా వుంది. ఈ విషయాలన్నీ లోకవిదితం అయిపోయినాయి.

శే—లోకుల అభిప్రాయాన్ని లొంగదీసిందేగాని మన లోపం లేనప్పుడు వెరవడం యెందుకు?

నర—అప్పటికంటే యింకొంచెం నిన్న రహస్యాలు జరుగుతూన్నప్పుడు వాళ్ళిద్దరూ డ్రాయింగురూమ్‌లో ఉన్నారు. నేనలా వెళ్ళేసరికి గదిమధ్యను నిల్చొని ఉన్నారు. నేరస్థులవలె ఉలికిపడి కంగారు మాటలతో మనోవైకల్యాన్ని వెల్లడిచేసారు. దాంతో నాకు గొప్ప అనుమానం పట్టుకుంది.

శే—అవినీతికార్యాలకి తగిన సమయంగాదు. అదీగాక గదిమధ్య నిల్చొని మీకొరకు ప్రతీక్షించడం యెందుకు—అన్ని సోఫాలుండగా. దోషమున్నా ఒక్కరిదే అయి ఉండాలి. సాధారణంగా పురుషుడిదేగా యీ విషయాలలో మొదటి దోషి.

నర—ప్రబంధాల్లో అపవాదు స్త్రీకే నియమించారు. అయినా మన మూరుకోకూడదు. మూర్తిని మేలుకొల్పాలి. జాగుచేస్తే కొంప మునుగవచ్చు.

శే—మీ రింటిలో యేమీ కలుగచేసుకోవద్దు. కొంప మునిగే దేమిటో నాకు కన్పడడం లేదు. మూర్తిగారికి నేనంటే చాలా గౌరవం. సమయానుకూలంగా నేను రాయబారం నడుపుతాను. మీరు పూర్వంవలెనే సంచరిస్తూవుండండి.

నర—నేనంటే నీ కెప్పుడూ చులకనే. నే జేయవలసిన పని చేసాను వేళైంది. పోతాను. (కుర్చీనుండి లేచి పక్కను తగిలించిఉన్న తలపాగాను తీసి ధరించును.)

శే—ఇంతకంటే చెడుచేసి ఉండదు. రాత్రి భోజనానికి వస్తారా!

నర—ఆభోజనం ఉండమంటా వేమిటి. నీ కంత కష్టమైతే హోటే ళులో భోంచేస్తానులే.

శే—నా కాడబ్బిస్తే మంచి వంటకాలు చెయ్యనా. సరే వెగిరం రండి.

నర—ఏదీ చిన్న ముద్దు.

శే—వేళాపాళా లేకుండా సరసం. నూతన విధానాలు వినియోగం లోనికి తెస్తున్నారు. వెళ్ళండి. (నరసింహం చేతితో ముద్దు విసరి ముందుద్వారముగుండా నిష్క్రమణ. శేషమ్మ వంటయింటిలోనికి పోవును. ఒక నిముష మైనతరువాత భట్టుమూర్తి యింటి దుస్తులతో చదరిన కురులతో ముందుద్వారమునుండి ప్రవేశించును)

భ—నరసింహం—నరసింహం. శేషమ్మగారు (వంటగదినుండి "యెవ రది" అని విన నగును. వెంటనే శేషమ్మ ముందుద్వారమునుండి ప్రవేశించును.)

భ—నరసింహం యింకా రాలేదే.

శే—కూర్చోండి. ఈవేళ భోంచేయకుండానే పెద్ద ప్లీడరు ఆఫీసుకు వెళ్ళేరు. పట్నంలోనే భోంచేసి కోర్టుకు వెళతారు.

భ—అతను లేకపోవడం మంచిదే మీతో నా స్వవిషయం మాట్లాడదామని వచ్చేను. (కొంచ మాగి) శేషమ్మగారూ మా యింట్లో కొత్తగా పుట్టిన కలకలం వినేయుంటారు. నరసింహం సూచనగా తనతో చెప్పినట్టు డాక్టరుగానుమూర్తిగారు నాతో చెప్పేరు. అందుపై నే నా సోదరీసమానురాలైన మీవద్ద నా హృదయం విప్పి కొంచం ధైర్యం తెచ్చుకుందామని వచ్చాను.

శే—ఇటువంటి అసూయపుకల్పనలకు ఆందోళన పడడ మెందుకు? మీవంటివారికికూడా యింత మనోధైర్యం లేకపోవడమా.

భ—స్వవిషయం వచ్చేసరికి గ్రంథాల్లో చదువుకున్న నీతివాక్యాలు

ఋషులకు బోధించే ధర్మశాస్త్రాలు సహాయపడవు. నాకు పుట్టిన వ్యాధి సామాన్యమైనది కాదు. ఎంత ప్రయత్నం చేసినా యీ ప్రణయ అనురాగబీజాలు నా మనస్సులో మొలకలెత్తి మానడంలేదు. ఏం జరిగినా నా జీవితధనమైన యీ ప్రేమను మలినము చేయకూడదు. ఎంత విపత్తు సంభవించినా నా కమల మీద అనురాగం తగ్గకూడదు. దాని పవిత్రత చెడరాదు.

శే—కమలమ్మ ప్రవర్తనయందు యిసుమంత కళంకముందంటే నే నమ్మను. మీ రట్టి తలపులకు తావీయకూడదు.

భ—నా కలువంటి తలంపులు కలలోనైనా లేదు. నే నేమైనా సందేహపడతానేమో యని తా ననుకోవచ్చునితప్ప.

శే—అయితే మీ కొచ్చిన చిక్కేమిటి. లోకు లేమైనా చెడ్డ మాటలు ప్రచారం చేస్తారనా.

భ—లోకులమాటలకు వీసమంత లెక్కచేసేవాణ్ని కాను. ఒకరికి నష్టం కలుగచేయకుండా బాధించకుండా సంచరించాలి. అంతే ఇతర జీవితి స్వేచ్ఛకి భంగం కలుగనివ్వరాదు.

శే—అందుకు నే నంగీకరించను. లోకాభిప్రాయాన్నిబట్టే మన మర్యాద, కీర్తి పరిణమిస్తాయి.

భ—లోకోభిన్నరుచి—అనేక విధాలు కాబట్టి యెవర్ని సంతోష పెట్టడమో తెలియదు. తరవాత—మనం సరియైన దారినే అనుసరిస్తుంటే మొదట పొరబడినా చివరకు లోకమే గ్రహించాలి. గ్రహించకపోతే వారిదే అశక్తిలోపము.

శేష—అది సరియైనదా కాదా అనడానికి యేమిటి ప్రమాణం.

భ—మన అంతరాత్మ.

శే—అయితే ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క అంతరాత్మ ఉండవచ్చు.

భ—అది ప్రకృతివిరుద్ధం. అంటాను మనుష్యులకి జీవసార మొక్కటే. మనం తప్పుదారిని మనసార తొక్కినప్పటికీ అంతరాత్మ తప్పని బోధిస్తూనే ఉంటుంది. (కొంచెమాగి) యిప్పుడు జగన్మోహన్ మా ప్రేమకు కొంత కలత తెచ్చాడని నాకు అసూయ పుట్టింది. అట్టి చిత్తరీతి తప్పని నాయిచ్ఛాశక్తివల్ల దానిని జయించాను—కాని నిజంగా కమలం అతన్ని ప్రేమిస్తే అప్పుడేమిటి. కమల మోన పుద్ధి దుష్ప్రవర్తనకు లోనే నీచవ్యక్తి కాదు. అది ముమ్మాటికీ నిశ్చయం. తనకు తెలియకనే ప్రేమ మొలకలు పుట్టియుండవచ్చు. అప్పుడేమి చెయ్యాను—శేషమ్మగారూ.

శే—ఇదియేమివింత! పరస్త్రీ పరపురుషుల్ని ప్రేమించడమా. ఘోర పాతకమే. అట్టి దాన్ని యేమి చేసినా పాపంలేదు. దీనిలో అభిప్రాయభేదానికి సందులేదు.

భ—ఇదియూ మీరుచేసే సహాయం. ప్రేమ మనస్సుకు ఆత్మకు సంబంధించినది. బాహ్య ప్రవర్తనలో మార్పులేమియు లేక పోవచ్చును. కాని ప్రేమ లేని శరీర సంబంధం నీతిభద్దమైన యేమి ప్రయోజనం.

శే—మూర్తిగారూ! మీరు చెప్పేదంతా బాగానే ఉంటుంది. కాని నాకు చాలవరకూ అర్థం కాలేదు. ఆచరణలోకి యేలా తెస్తారో తెలియడంలేదు.

భ—ఏది యెట్లున్నా కమలంమీద మీకింత గౌరవమున్నందుకు కృతార్థుడను. డాక్టరునాతో ముచ్చటించి నప్పటినుంచీ నాస్నేహితులు యీవిధంగా తలంతురా అని విచారపడ్డాను. మీరుమాత్రం నాకు సానుభూతిచూపి నాసంతాపం కొంచెం తగ్గించేరు. మిగిలింది పరిస్థితుల నడతనుబట్టి యేర్పడుతుంది.

మూర్తిగారూ—మీ యిరువురి స్నేహంవల్ల మా జీవితాని

కింత ఆనందం లభించింది. మీవారి తావా చూస్తే నామనస్సు నీరై
పోతుంది. ఏమిచేయమంటే అది చేస్తాను. ఇది మీ స్వగృహంగా
భావించి మీయిష్టం వచ్చినట్లు నన్ను వినియోగించండి.

భ—మీరు వందనీయులు. ఇట్టి స్నేహితులుండగా నాకేమి కొదువ. పోయివస్తా. శనివారం మాయింటికి మామూలుగా ఫలహారానికి వస్తారుకదా. (వచ్చినదారిని నిష్క్రమించుచుండగా శేషమ్మ తల యూచును. తరువాత ఆలోచనా నిమగ్నయై కూర్చునియుండును. కొంచుమూడు నిముషములు తరువాత పైనుండి "మిస్టర్ నరసింహం మిస్టర్ నరసింహం" అను కేక వినపడును.)

శే—(ఉలికిపడిలేచి) జగన్మోహను కంఠం. ఈదినం మాయిల్లు నాటకరంగస్థలంలాగా వుంది. ప్రధానపాత్రను నేనే (జగన్మోహన్ ఎడమ ద్వారంవద్ద ప్రవేశించి ద్వారమువద్దనే నిలచి)

జ—మిస్టర్ నరసింహం—మిస్టర్ నరసింహం.

శే—(కుర్చీనుండిలేచి) లోనికిరండి కోర్టువేళలో ఆయన యింట్లో ఉంటారా. తెలిసి ఆయన్నిగూర్చి పిలువడం.

జ—(ముందుకువచ్చి) ఆడువారిని పేరుపెట్టి వీధిలోనుంచి పిలువడం మనలో ఆచారంలేదు గాబట్టి అలాగు పిలిచాను.

—మన ఆచారాలమీద బొత్తిగా అభిమానం పోలేదు సంతోషమే. వాటిని నాశనంచేయడానికి కంకణం కట్టుకొన్నారుగా కాదూ కూర్చోండి. (జగన్మోహన్—కాన్వాసు కుర్చీపై కూర్చుండును. తరువాత యెదురుగా కర్రకుర్చీమీద శేషమ్మ కూర్చుండును.)

—మీతో మాట్లాడ్డానికే వచ్చాను. మీమంచి అభిప్రాయం గడిద్దామనే.

శే—స్థితిగతులు యేల్లాగున్నాయో తెలిసికోడానికా. ఇక్కడేముంది.

జ—శేషమ్మగారూ. నామనస్సు ఆందోళనపడుతూంది. మా అంత

రకూ మీరు ప్రేమ సంబంధాలనిచ్చి కష్టాలు తొలగిస్తూంటారు. నన్నుకూడా మీ మిత్రునిగ భావించమని నాకోరిక.

శే—సంకోచమీరా నడవడం పెద్దమగాచారంకాదు.

జ—నా ఊహాని పెడతోవలో పెడుతున్నారు

శే—మీరుగ సరియైన మార్గాన్ని అనుసరించకుంటే నామాటలు తిన్నగానే కనపడును. మీరు తలంపుతే నన్ను భావిస్తున్నట్లున్నారు.

జ—నేను నిర్లోభిసని చెప్పలేను కాని పరిస్థితులయొక్క మూలమునుబట్టి పరతత్రినుగు స్నేహితుణ్ని అగౌరవమాటలచే నొప్పించగాదు.

శే—నా ఉద్దేశాలు కలుగడానికి మీరే కారకులు. వాటిని ఉపశమించడానికి శీఘ్రంగా మీరే పూనుకోవాలి.

జ—మీరు నన్ను వృథాపాయున్నిగా చూస్తున్నారు కాబోలు. ఇప్పటి అసలు మనోస్థితి తెలిసికోడానికి యేమైనా యివ్వగలను.

శే—గడచిన నాటక ప్రసంగం గాఢమైన కుతూహలం సహజమే. కా ... రికి సమకూడ్డం అగుదు. మన దేశంలో మరిన్ని.

జ—నా అవస్థ మీకు విశేషంగా ఉంది. అయినప్పటికీ మీరు చెప్పిన్ని ననుముకోడానికి సిద్ధంగా ఉన్నాను. క్షమించాలి.

శే—ఇప్పటికి మీ మాటలవల్ల ప్రయత్నాలు కనిపిస్తుంది. ఇలా అని మంత్రాలు కమలమ్మగారిని బోధించకండి.

జ—బలంగా మీరా తెలిసే. ఆమె కిష్టమైతేనే.

శే—మొట్ట మీ దొగారిలోనే ఆ విషయం తెలిపితే బాగా ఉండేది. అయినప్పటికి ఆమె శ్రేచ్ఛకు భంగకరంగా మొహద్దైనా నడిచారా. లోకులు నోరు కట్టుపడేది.

జ—లోకులు కట్టగొట్టని ధిక్కరించేవార్ని యేంగాగా నొప్పించి అణగగొట్ట ప్రయత్నిస్తారు.

శే—మనం స్నేహపు హద్దుల్ని మించినపుడు లోకాన్నెందుకు నిందించడం.

జ—మీరు నన్ను నిందించినా నాకు నొప్పిలేదు. ఇపుడు నా సంకల్పం మూర్తి కమలల ప్రేమకు యేవిధమైన కళంకం లేకుండా చెయ్యడమే. వీలైతే వారితో స్నేహాన్ని కాపాడుకొంటూ అవసరమైతే ఆ స్నేహాన్ని కూడా వదులుకుంటూ.

శే—మీయందరి శ్రేయస్కరము కోరి నేనాడిన మాటలు మనస్సులో పెట్టకండి. మీ సద్గుణం నాకిపుడు గోచరించింది. సమయానుకూలంగా మీ సంకల్పసిద్ధికొరకు ప్రయత్నించండి. గతానికి విచారించ నవసరం లేదు.

జ—ఈ ప్రయత్నంలో మీరుకూడా సహాయపడి మూర్తికి నచ్చచెప్పాలి.

శే—మూర్తిగారికి నే చెప్పనంతటిదాననా. ఆయనకున్న సహనం, ఇంద్రియనిగ్రహం వర్ణించతగినవి. పుణ్యపురుషుడు. మీవల్ల తప్పున్నా క్షమించి తిరిగి ఆదరించును.

జ—కృతార్థుడని ఇపుడు నే చేయవలసినది మనస్సుకు కొంచం స్ఫురిస్తూంది శెలవు. మూర్తిగారి యింట శనివారం విందులో కలుసుకుందాం.

(తొందరగా వచ్చినదారినే నిష్క్రమించును. అతను పోవుచుండగా తెర)

భట్టుమూర్తి యింటివెనుక తోట. శృంగారమైన క్రోటన్లు, పూలచెట్లు, పాదులు, లతాగృహములు, రెండు చిన్నబల్లలు, అటు

నిటు కుర్చీలు, కమలమ్మ డాక్టరు రామమూర్తి మెల్లగా కుడివైపు నుండి ప్రవేశించి షికారు చేయునట్లు బల్లల వెనుకకు పోవుదురు.)

డా—నిన్నపడిన ఒక వర్షంతో తోటంతా ప్రణయునియగు స్త్రీలాగు అలంకరించుకొన్నట్లగుపడుతూంది.

కమ—ఈ చల్లదనంపైనే నా మనస్సుకు శాంతి నివ్వలేదు డా. నా జీవితాన్ని ఓర్వలేని అనే అగ్నితో మంట పెట్టుకోవాలని చూస్తున్నారు నా స్నేహితులు కూడాను. ఈలాంటి లోకము యొక్క అభిప్రాయం నన్నింతగా కొప్పించగలదని నే నెన్నడనుకోలేను.

డా—దీనంతటికీ కారణం నేననుకుంటా. నాకూ నరసింహానికి జరిగిన సంభాషణ కూడా తెలిస్తే మంచిదని చెప్పనుకాని యీ విధంగా మనస్సు కలవరపెట్టుకుంటారనుకోలేదు.

కమ—అది మీరు చెప్పకపోతే మాత్రం కలవరపడి ఉందును. నాతో మాట్లాడిన స్నేహితుల ప్రవర్తన కు తెలిసిగతేనా. నిన్నటి రోజున చీరలు కొంటున్నప్పుడు శాస్త్రిగారి వెంకట్రావుభార్య నన్ను చూసినట్లు నటించి పక్కగా నడిచి వెళ్ళింది.

డా—అవన్నీ మీ ఊహలు. మీ ధైర్యాన్ని మీరు మెచ్చి యెప్పటి వలెనే సంచరిస్తున్నారు. అయినా మెచ్చినా మార్పులేదు, చింత లేదు.

కమ—ఆ విషయమే నన్నింత కలతపెడుతూంది. మాటలవల్లగాని, ప్రవర్తనలవల్లగాని, యేమీ చేస్తారనిగాదు. ఆయనది సున్నితమైన మనస్సు. నాతో యీ విషయం ప్రసంగించకపోవడమే నన్ను దహించేస్తూంది.

డా—అలాంటి ప్రసంగం మీ స్వేచ్ఛకు భంగకరమని ఊరకున్నారు.

కమ—మీరెన్ని యెన్ని సర్ది చెప్పినా మనస్సు ఊరడిల్లదు. ఇక నాకు

పరీక్షసమయం కాబట్టి ఆయనని కూడా పరీక్షసమయమే. మీరా రింట్లోకి వెళ్ళి ఫలహారాలు సిద్ధం చేయించండి. వారంతా వచ్చే సరికి ఒక గంట కావచ్చు. మూర్తిగారింకా రాలేదు కాబోలు.

దా—ఈసరికి వచ్చుంటారు. ఆ పేటలో మిమ్ముల్ని కలిసికొమ్మని చెప్పనా.

కమ—చెప్పక మునుపే—ఆయనే వస్తారు. (డాక్టరు రామమూర్తి వచ్చినదారినే పోవును. కమలమ్మ ఒక పూవును కోసి పరిమళము ఘ్రాణించి మెల్లగా నడిచి ఒక కుర్చీమీద కూర్చుండును. మెల్ల మెల్లగా పువ్వును చిదిమి క్రింద పారవేయును. భట్టుమూర్తి కుడివైపునుండి ప్రవేశించి ఆమెవద్దకు పోవును.)

భ—పిల్లల రాకకోసం చూస్తూ మాట్లాడకుండా ఊరికే విచారావ సెందుకు.

కమ—(లేచి నిల్చొని ఇవాళ నా ప్రియ జీవనం తెలియక ఆలోచిస్తున్నా.

భ—ఆలోచనలు తేలే విషయం కాదే. హృదయపరీక్షలు తెలిసి పోవు .

కమ—స్వేచ్ఛావాతావరణంలోనే అట్టి హృదయాలు వికసిస్తాయి. మన గార్హస్థ్య జీవితంలో వస్తువుల గుణభేదాలు గ్రహించడం కష్టం.

భ—నీ జీవితంలో స్వేచ్ఛ కేమిలోటు.

కమ—అన్నీ తాత్కాలిక విషయాల్లోనే. ముఖ్యవిషయాల్లో లోకంలో జానికి స్వేచ్ఛ మనకి ఆవిర్భవించలేదు. పై నష్టపడికయుండికూడా లోకం ముందావ మాడుతున్నారు. మీరేమీ కలుగజేసుకోకుండా చూస్తున్నారు.

భ—వాటి నెప్పుడూ తలపెట్టలేదు.

కమ—లోకమంతా నన్ను నిందిస్తుంటే కొన్నాళ్ళకు నేనే తెలిసి తెచ్చుకొని పాతివ్రత్యధర్మాన్ని విధివశంగా అనుసరిస్తానని.

భ—ఆ ధర్మం నీకు నచ్చనిది నే నెప్పుడనుకోలేదు.

కమ—హృదయాన్ని నా కిష్టం వచ్చినవారి కివ్వడానికి నాకు హక్కులేదా.

భ—ప్రతి వ్యక్తికీ ఆ స్వేచ్ఛ ఉండాలనియే నీ కనేకసార్లు బోధించాను. అది లేకపోవడంవల్ల మన వివాహాలు ఆర్యసమ్మతం కావు.

కమ—అయితే తలిదండ్రులకి తమ బిడ్డలను వా రిష్టమైనవారి కిచ్చి వివాహం చేయడం ఆచారమైనప్పటికీ నీతిదాయకంకాదు.

భ—అదియే నా అభిప్రాయం.

కమ—మన వివాహానికిమాత్రి అట్టి స్వేచ్ఛ యేది.

భ—మన వివాహమా. (ఆశ్చర్యమును తెలుపును) మన పరిస్థితులనుబట్టి స్త్రీలకు అట్టి స్వేచ్ఛ కలగడాని కెంతమాత్రం వీలు లేకపోయినా నేనుమాత్రం యిష్టపడే నిన్ను వరించాను.

కమ—అట్టి వివాహం నన్ను యేవిధంగా బంధిస్తుంది. నే నెన్నడూ మిమ్ముల్ని వివాహానికిపూర్వం చూడనైనాలేదే. మీరు తెలియ జేసిన నీతిప్రకారం నేను మిమ్ముల్ని భర్తగా ఊహించ నవసరం లేదు.

భ—మన యీ పవిత్రమైన ప్రేమను యీవిధంగానా మలినం చేయడం. వివాహం అయినతరువాత మనం సంపూర్ణంగా ప్రేమించుచుండలేదా. నా జీవితమంతా నీ విద్యావిషయమై నీ వినోదాలకు వినియోగించలేదా. అది నానాటికి పెరిగి విజృంభించింది. నే చెప్పేమాటలకు మన యీ ఐదుసంవత్సరాల వివాహజీవితమే ప్రమాణం.

కమ—మనస్సుకు సందేహం రాకుంటే యెన్నాళ్ళైనా గడుపవచ్చును.

మీరు నా కిచ్చిన విద్యాదానాన్ని, నాగరికతకు ఎప్పుడూ కృతజ్ఞురాలనే. నా జీవితమంతా సమర్పించినా మీ ఋణం తీర్చ లేను.

భ—నే కోరేది నీ ప్రేమే కదా. మనస్ఫూర్తిగా యిచ్చిన ప్రేమ.

కమ—ఆవిధంగా ప్రేమ స్వేచ్ఛాగమనాన్ని బాధించగలరా. మొదట స్వతంత్రంగా యేర్పాటు కాబడని వివాహం దంపతులిద్దరూ విశ్వప్రయత్నాలు చేసిన ఆ తొలి లోపం పోగొట్టలేరు. ఈ ఆటంకం మిమ్మల్ని బాధించదు. మీరు స్వతంత్రంగానే యిందులో ప్రవేశించారు.

భ—ఎన్నడూ లేని యీ కష్టపుమాటలాడ్డానికి యేమిటి కారణం. నిన్నే విషయంలోనూ నిర్బంధించలేదే. మొదట నీకు స్వేచ్ఛ లేకపోవడానికి నే నేం చేయగలను.

కమ—నిర్బంధన లేకపోబట్టే కన్నులు తెరవడానికి నాకు వీలు కలిగింది. కొంత స్వేచ్ఛ లభిస్తే పూర్తిగా పొందుదామనే కుతూహలం మనుష్యులందరికీ ఉంటుంది. ఇప్పుడు యీ సమస్య పైకి రావడానికి కారణం మీకు తెలిసినదే.

భ—నాకేమీ స్పష్టంగా తెలియడంలేదు.

కమ—నేను జగన్మోహన్‌గారితో స్నేహంగా ఉండడం మీ స్నేహితులందరికీ కష్టంగా ఉంది. మీరుకూడా విధిలేక ఓర్చియున్నారు. ఈ స్నేహం యేవిధంగా పరిణమిస్తుందో అని ప్రతినిముషం భయపడుతున్నారు.

భ—ఊహాప్రవాహం నిరాటంకంగా పోనిస్తున్నావు. కాని మీ స్నేహవిషయమై నా కట్టిచింతా లేదు. లోకుల అపవాదలను చెవి బెట్టనని నీకే తెలుసును.

కమ—ముందేమి జరుగునోయని శంక మీకుండ. నరసింహంగారి

యింట్లో జరుగుతున్న సభల పరిణామమంతా ఆచోకీగా నాకూ తెలిసింది. అదిగాక నాతో ప్రసంగించకుండా మన రహస్యవృత్తాంతాలు మీ స్నేహితులతో తర్కించడం ప్రేమకు కళంకమే.

భ—నీకు కష్టం కలుగచేయడం యిష్టంలేక నీ స్వేచ్ఛకు ఆటంకం రాకుండా ఉండడానికే యెన్నడూ యీ విషయం నీతో ముచ్చటించలేదు. వేరొకటేమీ కాదు. శేషమ్మగారితో మాత్రం ఆమె అభిప్రాయం తెలిసికోడానికి ప్రసంగించేను. మనస్సు కలవరపడి నప్పుడు స్నేహితులవద్ద వెడలపుచ్చుకోవడం శాంతిదాయకమే కదా.

క—నా మనస్సు కలవరపడి ఆత్మపరీక్ష చేసుకుంటే నా ప్రేమ స్వేచ్ఛలోపలలేదు. కాబట్టి పవిత్రమైంది కాదని తోచింది. స్నేహితుల గుసగుసలు, సంకెళ్లు తెంచుకుందామనే సంకల్పాన్ని స్థిరపరిచింది. ఇలాంటిమాటలు మీకెంత కష్టమో నాకు తెలుసును. ఇది నియమితం. కష్టాలనుండి సృష్టి వచ్చుటే జీవితానందం.

భ—ఇంతవరకూ నీభావం నా కగోచరంగానుంది. నీవేమి చెయ్యమన్నా చేస్తాను. ఈసందేహపు లవస్తలోనుంచి మాత్రం వేగిరం తప్పించు.

క—నాహృదయాన్ని నాయిష్టంవచ్చినచోట అర్పించుకోడానికి నాకు స్వతంత్రం యివ్వమని నాప్రార్థన. అది నాహక్కని మీకు తెలియ జేయడానికి ప్రయత్నిస్తున్నాను.

భ—నాయందు ప్రేమతొలగిపోయింది. స్వతంత్రం నే నిచ్చేదేమిటి. అప్పుడే నీహృదయం మరొకరి కర్పించేసి యీమాటలవల్ల నన్ను కొంత శాంతి పరచమాస్తున్నావు. నే ననుకున్నట్టే జరిగింది. సంస్కరణ విషయాల్లో ముందడుగు వేసేవారు యెన్నికష్టాలైనా అనుభవించ వలసిందే.

క—నాయిష్టం వచ్చిన వారిని ప్రేమించెడం నా ప్రకృతి ధర్మమే. సంఘం యెన్నికట్టుబాట్లు చేసినా దాన్ని ఆపగలదా. మీరు చెప్పినట్టు అప్పుడే యింకొకరి వంక నా హృదయం మరలించుకొంది. అందులో తప్పేమి. నిముల్ని మోసపుచ్చలేదే. నిముల్ని ఒడబరచి—అప్పుడే అర్పిస్తాను.

భ—శరీర సంబంధమైన వ్యామోహాన్ని ప్రేమని అనుకుంటున్నావు. పవిత్రమైన వివాహంవల్ల మనం కట్టు పడ్డాం కాబట్టి దాని నీతులను అనుసరించాలి. మన యిచ్ఛలకది ఆటంకమైనా సహించి జీవితాన్ని నడపాలి. అందులో మన జీవితం మన నడవడికవల్ల మరింత పవిత్రం చేసుకొని విజ్ఞాన పూరితమైన వాతావరణంలో సుఖిద్దాం. అట్టిదానిని యింతచులకనగా చూచి యేదో స్వేచ్ఛనే పెట్టి నాశనం చేయాలని తలుస్తున్నావు. అట్టి తప్పులు విడువమని నాయందున్న గౌరవాన్ని బట్టి నుమపూర్వ ప్రేమనుబట్టి వేడుకుంటున్నాను.

క—మీరనుకుంటున్న పూర్వాచార పరాయణుడైన సోత్రీయుని భావాలకి యేమీ భేదం కనబడదు. మీకు స్వేచ్ఛంటే అర్థంలేని ఉత్తమాట. సభాలలోను, ఉపన్యాసాలలోను గంభీరంగా ప్రసంగించడానికి ఒక సాధనకాబోలు. తల్లిదండ్రులచే చేయబడ్డ స్త్రీవివాహానికి మీ నీతులు అనువర్తిస్తాయి. ఎట్టి ప్రతికూలవ్యాపారులైన సంపతున్నైనా బంధిస్తాయి. మన జీవితంలోగాని వివాహంలోగాని ఉన్న విశేషాంశం నాకేమీ కనపడదు. ఎంతసేపూ పురుషుడు తన సుఖాన్ని ఆశించుకొంటూ దానికి అనుగుణంగా ఉండే తెరువు నీతిదాయకమని బోధిస్తాడు. మీరూ అంతే. మీ భావాల దృష్టి యిప్పుడు స్పష్టపడింది.

భ—నియంకుండే ప్రేమవల్ల గౌరవంవల్ల నీ సుఖాన్ని మనసార

కోరి యీవిధంగా చెప్పను, కాని నా సుఖాన్ని కోరుకోలేదు. అది నిజం. ఇక నేనీసంభాషణ పొడిగించిన కార్యంలేదు. నీ యిష్టం వచ్చినట్లు చేయవచ్చును. నా ప్రేమమాత్రం చెలింప నీయను.

కమ—నే కోరింది నాకివ్వవలయును. నా స్వేచ్ఛ.

భ—జగన్మోహన్ ప్రేమించడానికా ?

కమ—అయితే కావచ్చును. ముందు నాకు స్వేచ్ఛ కలిగింతరువాత నా హృదయాన్ని యెవరి కర్పించడమో, లేక ఒంటరిగా సన్యాసినై దినములు గడపడమో ఆలోచిస్తా.

భ—మనకే బిడ్డలుంటే యిలాంటి విశేషాలు పుట్టియుండవు—అయినా, నీవు కోరినట్లు నీ హృదయస్వేచ్ఛ మనసారా యిస్తున్నాను. నీవు సుఖించడమే నా మనస్సమ్మతము.

కమ—ఇప్పుడుగదా మీ కమనీయమైన గుణాన్ని ప్రదర్శించారు. నా గుండెమీద పెద్ద రాయి తొలగిపోయింది. ఇప్పుడు కొత్త గాలి పీలుస్తున్నాను. ప్రకృతి కాంతిసమేతమంతా ఉన్నట్లు కనపడుతుంది. ఈతోటలో యిదివరకెన్నడూ చూడని వింత సౌందర్యం యిప్పుడు కనపడుతూంది. కొంతసేపు తోటలో తిరిగి వస్తాను. (కమలమ్మ భర్తమూర్తి యేమనునో వినకుండానే యెడమవైపుకు తొందరగా పోవును. డాక్టరు రామమూర్తి కుడిప్రక్కనుండి ప్రవేశించును.)

డా—ఏమిటి మూర్తిగారూ దీర్ఘాలోచన చేస్తున్నారు.

భ—నా జీవితం అంధకారమైంది. నా చేతలన్నీ నిష్ఫలం అయినాయి. ఆశలన్నీ నిరాశలైనాయి. ఆనందం, సుఖం దూరమైనాయి. ఇన్నీ ఒక్క నిముషంలో వచ్చి ముంచేసేయి.

డా—ఏమి జరిగింది—ఏమి జరిగింది ? నాప్రాణం అడ్డువేస్తాను.

భ—నా ప్రాణం నన్ను విడిచి యితరుల నాశ్రయించడానికి వెళ్లిపోయింది. నేను ప్రాణపదంగా పెంచిన నాకమలం తన హృదయాన్ని నాస్వాధీనంనుంచి తప్పించుకొని యెగిరిపోయింది. అది త్తృప్తి మరల్చడానికి అనురూపమైన ఉపాయం తోచిందికాదు.

డా—కొంపమునిగింది. అదిగో నరసింహందంపతులు వస్తున్నారు. కొంచెం సమర్ధించుకోవాలి. కష్టసమయంలోకదా యింద్రియ నిగ్రహం బయలు పడుతుంది.

(నరసింహం శేషమ్మ కుడివైపునుండి ప్రవేశించెదరు.)

న—మేము రావడం కొంచమాలస్యమైంది. ఇతర స్నేహితు లెవ్వరూ రాలేదే.

డా—ఈరోజున చిన్న కుటుంబ కూడికనంటిది. కమలమ్మగారు నిమ్మలనీ జగన్మోహన్‌గారిని మాత్రం పిలవమన్నారు. నాకూ యిదే బాగుంది. పెద్ద సమూహమైతే యీవిందుల కలవడి చెడుతుంది. అప్పుడు ఫలహారాలు పుచ్చుకోవడమే ప్రధాన కార్యమౌతుంది.

న—తోట యీరోజున చాలాయింపుగా ఉంది. ఏమిమూర్తీ మౌన ముద్ర వేశేవు. రండి మోహన్ వచ్చేలోగా కొంత విహారం సాగిద్దాం.

భ. గొక్కడికే యీతోట అందం మాటువడింది.

డా—రండి మూర్తిగారూ.

శే—నేను మాత్రం యిక్కడే కూర్చుంటాను.

న—నిన్నెవ్వరూ పిలువండే. ఒక్కర్తెవే అడుదానివి మగవాళ్ళలో యెందుకు.

శే—అడది ఉండే అందం, అరుచి మీకింకా తెలియలేదు. వెళ్ళండి, వెళ్ళండి.

(భట్టుమూర్తి లేచును. నరసింహం డాక్టర్లు అనుసరించగా

మొదటు వైపునుండి పైకిపోవుదురు. కుడిప్రక్కనుండి కమలమ్మ ప్రవేశించును.)

శే—కమలమ్మా—రా—కూర్చో. ఈమధ్య ఎప్పుడూ పరధ్యాన్నంగా ఉన్నట్టు కనపడుతున్నావు. నాతో మనస్సిచ్చి బొత్తిగా మాట్లాడ్డం మానేసేవు.

క—మీకు తెలియని విషయాలేమైనా ఉంటేగా. అందరూ నీతో ముచ్చటించేవారే. నామనో స్థితికూడా తెలిసినట్టే కనబడుతున్నావు.

శే—నామీద దేనికుకోపం. నీసుఖాన్నే యెప్పుడూ కోరేదాన్ని ఇతరులు నాతో మొరపెట్టుకుంటే నే నాపగలనా. అరటితడపని నాగుపాము చేస్తున్నారు.

క—లోకం యేదిచెయ్యడానికైనా సిద్ధమే. మాటవరస కన్నాను కాని నీమీద నాకేమీ లేదు—వాత్సల్యం తప్ప. నా అవస్థ నీకు తెలిస్తే సానుభూతి చూపే ఉంటావు.

శే—చిన్నచిక్కులు సహించడమే ఆడదాని ముఖ్యమైనపని. నాచేతి కొలది నేనూ చేస్తుంటాను.

క—మనోకల్పితమైన చిక్కులు పరిస్థితులే తీర్చాలి. నీ మంచి అభిప్రాయం, సహాయభూతమే.

(జగన్మోహన్ కుడిప్రక్కనుండి, డాక్టరు, నరసింహం, భట్టుమూర్తులు యెడమప్రక్కనుండియు ప్రవేశింతురు)

డా—జగన్మోహన్‌గారు కూడా వచ్చేరు.

జ—అందరకూ వందనాలు. ఆలస్యమైనందుకు క్షమించాలి. ఇంగ్లండు పోవడానికి ప్రయాణప్రయత్నంలో ఉన్నాను. ఈవేళ స్టీమరు టికెట్టు వగయిరాలుకొన్నాను.

శ—మీరొక్కరేనా!

డా—నరసింహాంగార్ని కూడా తీసుకువెళ్ళండి.

శే—ఆవిధంగానయినా కొంతనాగరికత అబ్బుతుంది.

ధ—కూర్చోండి, కూర్చోండి. డాక్టరుగారూ టీ తీసుకొని రమ్మని చెప్పండి.

(డాక్టరు పోవును.)

శే—ఏమి యింత తొందరగా ప్రయాణం నిశ్చయించారు.

జ—విశాలమైన సముద్రం మధ్యనుంటే మనస్సుకు కొత్తవికాసం వస్తుంది. విలువైన వస్తువులు వెనుకదృష్టిలో మరీ రమ్యంగా కనిపిస్తాయి. (డాక్టరు, వెనుక నౌకరు టీ పలహారములు పళ్ళెములో నుంచి తెచ్చును. బల్లమీద నుంచబడును. డాక్టరు అందరకూ టీ పోసియిచ్చి విందుకార్యక్రమం సాగించుచుండును. పలహారం పుచ్చుకొనుచుందురు.)

డా—(నౌకరునుచూచి) నీవుపోయి యింట్లోపనులు చూచుకో. అయితే జగన్మోహన్‌గారి నిర్ణయం తిరిగి మొన్నాళ్ళకో.

క—ఆయన్ని సాగనంపడానికి విందివ్వకూడదా. అందరికీ సంతోషంగా ఉంటుంది.

జ—మీ అందరి వాత్సల్యం ఉంటే—అదేవిందు.

న—పలహారాల రూపంగా వాత్సల్యం బయలు పడుతుంది.

జ—ఇక్కడున్న వారంతా ప్రాణస్నేహితులే దాపరిక మనవసరం. నామనస్సును బాధిస్తూఉన్న భారం దించుకోడానికి యిదేమంచి సమయం.

న—అడక్కుండా రహస్యాలు చెప్పడం ధర్మంకాదు.

జ—నేను ధర్మం తప్పినడిచేనుకాబట్టే, మీ యందరిమెదుట నాతప్పు ఒప్పుకొని సవరణ చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను.

ధ—తప్పులేనివా రెవరు. మీ రంతకష్టపడడం నా కసమ్మతం.

జ—చేసినతప్పు చెబితే పోతుం దంటారు. అదీగాక మీ స్నేహం శాశ్వతంగా సంపాదించుకోవడానికి యిదే మార్గమని నాకు తోచింది. చిన్న విషయాలైనా కప్పిపుచ్చడంవల్ల ప్రచండరూపాన్ని వహిస్తాయి. అవి లోకుల వింజ్యామరలచే చలించబడి మనస్సుని కలవరపరచి హృదయాల్ని భస్మం చేస్తాయి. అన్నిటికంటె ముఖ్యమైంది—యెవరిప్రేమ జీవితం నాకు ఆదర్శనీయంగా కనపడిందో యెవరిని అన్నివిషయాల్లో అనుకరించడానికి ప్రయత్నించానో అట్టిదంపతుల సుఖజీవితంలో, నాప్రవర్తనవల్ల దుఃఖం ప్రవేశించింది. అట్టిదానిని మొలకగా ఉన్నప్పుడే త్రుంచివెయ్యాలి.

న—మీధోరణి నా కగోచరంగా ఉంది. వేగిరం కానివ్వండి.

జ—కమలమ్మగారి ధారాళస్వభావమూలాంగా వారి స్నేహానికి పాత్రుడనై యెన్నో సుఖదినాలు గడిపేను. వారింట విందులై రసవంతమైన వినోదాలు అనుభవించేను. ఒకనాడు, నాటకరిహార్సలు సమయాన్ని యింద్రియనిగ్రహం లేక తాత్కాలికంగా స్ఫురించిన వాంఛ ననుసరించి ఆమెను ముద్దాడ ప్రయత్నంచేసి,—ఆమెకు తెలియకుండా వెనకనుండి వెళ్ళి ఆమె కంఠాన్ని నా పెదవులతో తాకేను. ఆమెకు కోపమువస్తే మొదట సంకర సమాధానాలు చెప్పి తరువాత క్షమార్పణ వేడుకున్నాను. ఆమె ఔదార్యంవల్ల క్షమించేరు. కాని మా మచ్చికలు కొన్ని తెలుసుకొని, కొన్ని ఊహించి మన స్నేహితులు వింతవదంతు ప్రచారం ఆరంభించేరు. మే మిద్దరంకలిసి ఇంగ్లండుకు వెళతామనే సంగతి దాన్ని మరింత బలపరిచింది. ఇవన్నీ చేరి మూర్తిగారి మనస్సు నొచ్చిం దని ఊహించేను. మూర్తిగారుకూడ నన్ను క్షమించి పూర్వంవలెనే స్నేహంగా చూడమని వేడుకుంటున్నాను.

చిన్నవిషయానికి మీ రింతగా నొచ్చుకొనకూడదు. ఇందు

కూలంగా నాప్రేమపరీక్షకు వీలైందని సంతోషస్వాంతనైతి. నాభర్తనుకూడ కొంత కష్టించి, నా ప్రేమపవిత్రతను కాపాడ్డం కొరకు, నాకు హృదయస్వేచ్ఛ నివ్వగోరి దాన్ని సమకూర్చుకొన్నాను. విశాలభావంతో ఆస్వేచ్ఛ నిచ్చుటకు అంగీకరించేరు. తిరిగి యింతలోనే మా ప్రేమ వికసిస్తుందనుకోలేదు. జగన్మోహన్ గారి ఉదారస్వభావంవలనే యీనూతనసమ్మేళన సమకూడింది. ఆయన లేకుంటే యెంతకాలం పట్టియుండునో? నాకిష్టంవచ్చిన వారిని ప్రేమించడానికి నాకు హక్కు కలదని నాభర్త ఒప్పుకున్నారు. వివాహంవల్లనే హృదయాన్ని కట్టివెయ్యడానికి వీలు లేదని ఒప్పించేను ఇపుడు స్వేచ్ఛగా మనస్ఫూర్తిగా నా హృదయాన్ని నాభర్తకే తిరిగి అర్పిస్తూన్నాను. (భట్టుమూర్తివంకకు పోయి ఆతనిని కౌగలించుకొనును. అందరు లేచి నిలుతురు. నరసింహం శేషమ్మను యెడమప్రక్కకు పోయి నిలతురు. మధ్య భట్టుమూర్తి కమలమ్మలు. కుడిప్రక్కను డాక్టరు రామమూర్తి జగన్మోహనులు).

న—మనమూ (శేషమ్మను కౌగలించ ప్రయత్నించును.)

శే— కొంచం తొలగి) ఉష్.

భ—జగన్మోహన్ వాత్సల్యంవల్లే మాకీసౌభాగ్యం లభించింది. ఎండకాలంలో శెలవు వచ్చుకొని కమలమ్మను ఇంగ్లండుకు తీసుకొనివస్తా. అక్కడ కలుసుకుందాం.

డా—మీ ప్రేమజీవితంవల్ల అందర్నీ ఆకర్షిస్తూ సుఖముందురు.

న—తథాస్తు. (తెర)

సరస్వతీ గ్రంథమండలి ప్రచురములు

—• నవలలు •—

	చందాదారులకు		ఇతరులకు	
	రు.	అ.	రు.	అ.
[illegible]ముసుందరి	౧	౦	౧	౮
[illegible]రశిఖామణి	౧	౦	౧	౮
[illegible]ప్రసాదము	౧	౦	౧	౮
[illegible]త్యరహస్యము	౧	౦	౧	౮
[illegible] (మొదటిభాగము)	౧	౦	౧	౮
[illegible] (రెండవ భాగము)	౧	౦	౧	౮
[illegible]ద్వా[illegible]	౧	౦	౧	౮
చిన్న కోడలు	౧	౦	౧	౮
[illegible]	[illegible]	[illegible]	౧	౮
[illegible]హాగ[illegible]ము	౧	౦	౧	౮
[illegible]హా[illegible]ము	౧	౦	౧	౮
మొగలాయీదర్బారు ౧ భా॥	౧	౦	౧	౮
[illegible]ము	౧	౦	౧	౮
[illegible]	౧	౦	౧	౮
[illegible]	౧	౦	౧	౮
జాగిలము	౧	౦	౧	౮
మొగలాయీదర్బారు ౨ భా॥	౧	౦	౧	౮
సరస్వ[illegible]	౧	౦	౧	౮
[illegible]	౧	౦	౧	౮
హత్యాన్వేషణము	౧	౦	౧	౮
మొగలాయీదర్బారు ౩ భా॥	౧	౦	౧	౮
గంగ	౧	౦	౧	౮
మొగలాయీదర్బారు ౪ భా॥	౧	౦	౧	౮
[illegible]	౧	౦	౧	౮
[illegible]	౧	౦	౧	౮
అపరిచిత	౧	౦	౧	౮
అంతఃపురము ౧ భా॥	౧	౦	౧	౮
అంతఃపురము ౨ భా॥	౧	౦	౧	౮
అగ్రహారము	౧	౦	౧	౮
ఛిన్నహస్తము ౧ భా॥	౧	౦	౧	౮
ఛిన్నహస్తము ౨ భా॥	౧	౦	౧	౮
కంకణరహస్యము	౧	౦	౧	౮
జీవి		౦		౮

—• నాటకములు •—

	చందాదారులకు		ఇతరులకు	
	రు.	అ.	రు.	అ.
మార్కండేయనాటకము	౦	౮	౦	
అహల్యాశాపవిమోచనము	౦	౮	౦	౧౨
మీవారుపతనము	౦	౮	౧	[illegible]
[illegible]	౦	౮	౧	౦
[illegible]	౦	౮		౦
నూర్జహాను	౦	౮	౧	౦
మురారిదాసు	౦	౮	౧	౦
చంద్రగుప్త	౦	౮	౧	౦

—• అను[illegible]ములు •—

	చందాదారులకు		ఇతరులకు	
	రు.	అ.	రు.	అ.
[illegible]	౦	౮	౦	౧౨
[illegible]	౦	౮	౦	౧౪
[illegible]	౦	౮	౦	౧౨
[illegible]యుపదేశములు	౦	౮	౧	[illegible]
[illegible]వమాల	౦	౮	౧	౦
[illegible]	౦	౮	౧	౦
సుశీల	౦	౮	౧	౦
[illegible]	౦	౮	౧	౦
[illegible]	౦	౮	౦	
[illegible]	౦	౮	౧	
[illegible]	౦	౮	౧	
[illegible]	౦	౮	౧	
[illegible]	౦	౧౨	౧	
[illegible]	౦	౮	౧	
[illegible]	౦	౮	౧	
[illegible]	౦	౮	౧	
[illegible]	౦	౮	౧	

పోస్టేజి ప్రత్యేకము.

కేటలాగు ఉచితము.

14582